

జిల్లా రెవెన్యూ అధికారిగా వెంకటేశ్వర్లు



కరీంనగర్ టౌన్, అక్టోబర్ 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా రెవెన్యూ అధికారిగా బి వెంకటేశ్వర్లు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనను అధికారులు, ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

జానపద కళలకు నిలయం తెలంగాణ

గణేశ్‌నగర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రాంతం జానపద కళలకు, సంస్కృతి సాంప్రదాయాలకు నిలయమని, ఆ కళల వారసత్వాన్ని భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. గురువారం కరీంనగర్ ఫిలిమ్ భవన్‌లో జిల్లా విద్యాశాఖ-సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నిర్వహించిన కళా ఉత్సవ్-2024కు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతిలో బతుకమ్మ, బోనాలు మొదలైన పండుగలు జానపదుల జీవన విధానంతో ముడిపడి ఉన్నాయన్నారు. ఇక్కడి జానపద కళలన్నీ ఈ నేలను సుసంపన్నం చేసాయని, తెలంగాణ జాతి వారసత్వాన్ని తెలిపే విధంగా ఉంటాయని ప్రశంసించారు. డీఈవో సీహెచ్‌వీఎస్ జనార్దన్‌రావు మాట్లాడుతూ విద్యార్థుల్లోని సృజనాత్మక నైపుణ్యాలను, కళలను వెలికితీయడానికి ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి అశోక్‌రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి జైపాల్‌రెడ్డి, న్యాయ నిర్ణేతలు గాజుల రవీందర్, నంది శ్రీనివాస్, చొప్పరి జయశ్రీ, కొత్తకొండ సత్యనారాయణ, కేబీ శర్మ, స్తంభంకాడి గంగాధర్, శ్రీధర్, ఖాజా మంజూర్ అలీ, మురళీకృష్ణ, రాధాకృష్ణ పాల్గొన్నారు.

● రాష్ట్రస్థాయికి ఎంపిక

ఈ సందర్భంగా కళా ఉత్సవ్-2024లో జిల్లా స్థాయిలో గెలుపొందిన విజేతలను రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతామని డీఈవో సీహెచ్‌వీఎస్ జనార్దన్‌రావు తెలిపారు. గాత్ర సంగీతంలో కె అశ్విని, నృత్యంలో సీహెచ్ నక్షత్ర బృందం, థియేటర్ ఆర్ట్స్‌లో కె సహస్ర, దృశ్య కళలు జి ధరణి, సంప్రదాయ కథలు చెప్పడంలో బి హర్షశ్రీ, వాద్య సంగీతంలో ప్రవీణ్‌నాయక్ జిల్లాస్థాయిలో విజేతలుగా నిలిచారన్నారు. వీరిని రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామని తెలిపారు.



నృత్యం చేస్తున్న విద్యార్థినులు



ఏఈవోలకు గుదిబండగా డిజిటల్ సర్వే

- ● ఆందోళనకు సిద్ధమవుతున్న ఉద్యోగులు
- ● తాత్కాలిక నియామకాలు చేపట్టకపోవడంతో అదనపు భారం
- ● కేంద్రం సూచనలను పెడచెవిన పెడుతున్న అధికారులు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డిజిటల్ పంట సర్వే వ్యవసాయ విస్తరణ అధికారులకు (ఏఈవో) గుదిబండగా మారింది. తాత్కాలిక సిబ్బందిని నియమించి వెయ్యి ఎకరాల విస్తీర్ణాన్ని ఒకరితో సర్వే చేయించమని కేంద్రం మార్గదర్శక సూత్రాలను విడుదల చేస్తే రాష్ట్ర వ్యవసాయశాఖ అధికారులు మాత్రం ఎలాంటి నియామకాలు చేపట్టకుండానే ఉన్న ఏఈవోలపైనే ఈ బాధ్యతను పెట్టి చేయాల్సిందేనంటూ కొరఢా ఝుళిపించడంపై నిరసన వ్యక్తమవుతున్నది. ఈ వ్యవహారం రాష్ట్ర వ్యవసాయశాఖ ఉన్నతాధికారులకు, ఏఈవోలకు మధ్య వివాదంగా మారుతోంది. దేశవ్యాప్తంగా 12 రాష్ట్రాల్లో డిజిటల్ అగ్రి మిషన్ కార్యక్రమంలో భాగంగా సాగులో ఉన్న భూమిని డిజిటల్ సర్వే చేస్తూ ఫొటోలు తీసి సాగు చేసిన పంటల వివరాలను డిజిటలైజ్ చేయాలని కేంద్రం భావించింది. ఆ మేరకు డిజిటల్ అగ్రిమిషన్ కార్యక్రమాన్ని ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నది. క్షేత్రస్థాయికి వెళ్లి సాగులో ఉన్న పంట భూములను పంటతో సహా ఫొటోలు తీసి డిజిటలైజ్ చేయాల్సి ఉంటుంది. దీనికోసం దేశవ్యాప్తంగా 2.5 లక్షల మంది నిరుద్యోగ యువతకు శిక్షణ ఇచ్చి వారికి ఈ సర్వేను అప్పగించి ఉపాధికల్పించాలని భావించారు. ప్రతి వెయ్యి ఎకరాలకు ఒక తాత్కాలిక ఉద్యోగిని నియమించి, అతడి ద్వారా పంటల సర్వే చేయించాలని, స్థానిక ఏఈవోలు వీరికి సహాయకులుగా ఉండాలని మార్గదర్శకాల్లో నిర్దేశించారు. రాష్ట్రంలో వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు తాత్కాలిక నియామకాలు ఏమి చేయపట్టకుండానే ఏఈవోలపైనే ఈ బాధ్యతను మోపారు. దీనితో ఏఈఓలు ఈ పని తాము చేయలేము అంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

● జిల్లాలో 3.2 లక్షల ఎకరాల్లో సాగు

జిల్లాలో రైతులు 3.2 లక్షల ఎకరాల్లో వివిధ పంటలను సాగు చేశారు. జిల్లా వ్యవసాయశాఖ మూడు, నాలుగు గ్రామాలను కలిపి ఒక క్లస్టర్‌గా గుర్తించింది. జిల్లాలో 76 క్లస్టర్లు ఉండగా 68 మంది రెగ్యులర్ ఏఈవోలు, ఎనిమిది మంది ఔట్‌సోర్సింగ్ ఏఈవోలు పనిచేస్తున్నారు. ఒక్కో క్లస్టర్‌లో ఐదు వేల నుంచి 15వేల ఎకరాల వరకు భూమి సాగవుతున్నది. కేంద్రం వెయ్యి ఎకరాలకు ఒకరితో సర్వే చేయించాలని సూచిస్తే ఒక్కో ఏఈవోతో ఐదు వేల నుంచి 15 వేల ఎకరాల సర్వే ఎలా చేయిస్తారని వారు ప్రశ్నిస్తున్నారు.

● పైలట్ ప్రాజెక్టులో 28 వేల ఎకారాలకు 30 మంది ఏఈవోలు

గతంలో జిల్లాలోని జమ్మికుంటలో సర్వేను పైలట్ ప్రాజెక్టుగా నిర్వహించారు. 28 వేల ఎకరాలను 30 మంది ఏఈవోలు మూడు నెలలపాటు సర్వే చేశారు. ప్రస్తుతం 3.2 లక్షల ఎకరాలను 76 మందితో చేయించాలని వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు నిర్ణయించి ఆదేశాలు జారీ చేయడం ఏఈవోలకు మింగుడుపడడం లేదు. మూడు నెలల్లోగా డిజిటల్ సర్వే చేయడం ఎలా సాధ్యమవుతుందని వారు ప్రశ్నిస్తున్నారు. కేంద్రం విడుదల చేసిన మార్గదర్శక సూత్రాలను పాటిస్తూ కర్ణాటక, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒరిస్సా, ఆంధ్రప్రదేశ్ తదితర 11 రాష్ట్రాలు క్షేత్రస్థాయిలో ప్రతి వెయ్యి ఎకరాలకు ఒక నిరుద్యోగిని తాత్కాలిక ప్రాతిపదిక నియమించుకొని వారితో క్షేత్రస్థాయిలో పంటల సర్వేను పకడ్బందీగా చేయిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాల ప్రకారం జిల్లాలో 3.2 లక్షల ఎకరాలకు 320 మంది తాత్కాలిక ఉద్యోగులను నియమించాల్సి ఉన్నది. కాని ఆ నియామకాలు చేపట్టకుండానే 76 మంది ఏఈవోలతో ఈ పనిని పూర్తి చేయించాలని భావించి ఆదేశాలు జారీ చేశారు. సుమారు 10 మంది చేయాల్సిన పనిని ఒక్కరితోనే చేయించాలని చూడడంతో ఏఈవోలపై తీవ్రమైన శారీరక, మానసిక ఇబ్బందులను కలిగిస్తుందని వారు వాపోతున్నారు. తమకు శారీరకంగా నష్టం కలిగించడమే కాకుండా ఎక్కువ పనిభారం వేసి హడావుడిగా మూడు నెలల్లోనే సర్వే జరగాలనడంతో తప్పులు జరిగే అవకాశం ఉందని ఏఈవోలు అంటున్నారు.

మానవతా ధృక్పథంతో డిజిటల్ సర్వే నుంచి మినహాయించాలి

- కాంట్రాక్టు ఏఈవో

ఎనిమిది నెలలుగా వ్యవసాయ శాఖలో తాత్కాలిక ప్రాతిపదికన ఏఈవోగా పనిచేస్తున్నాను. నాలుగు నెలలుగా జీతం రావడం లేదు. ఆర్థిక ఇబ్బందులతో ఈ ఉద్యోగంలో చేరాను. రెగ్యులర్ ఏఈవోలకు ఉన్నట్టు మాకు ఎలాంటి ఉద్యోగ భద్రత, ఆరోగ్య భద్రత, వ్యక్తిగత జీవిత బీమా సదుపాయాలు లేకున్నా కొండలు, గుట్టలు, అటవీ భూముల్లో ఒంటరిగా తిరుగుతూ డిజిటల్ పంట సర్వే చేయాలని ప్రభుత్వం మాపై ఒత్తిడి తీసుకొస్తోంది. మానవతా దృక్పథంతో డిజిటల్ పంట సర్వే నుంచి కాంట్రాక్ట్ ఏఈవోలను మినహాయించాలి.

ఏఈవోలపై ఒత్తిడి చేయడం సరికాదు

- దారం శ్రీనివాస్‌రెడ్డి, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు

రాష్ట్రంలోని 300 మంది ఔట్‌సోర్సింగ్ ఏఈవోలు, 2,300 మంది రెగ్యులర్ ఏఈవోలను డిజిటల్ సర్వే యాప్ ఇన్‌స్టాల్ చేసుకోవాలని, చెయ్యని వారిని విధుల నుంచి తీసివేస్తామని అధికారులు భయపెడుతున్నారు. దీంతో వారు భయభ్రాంతులకులోనవుతున్నారు. రెగ్యులర్ ఏఈవోలు డిజిటల్ పంట సర్వే చేయలేదని 15 రోజులుగా అన్ని పనులు చేస్తున్నా క్యాజువల్ లీవ్‌గా పరిగణిస్తున్నారు. ఇలా ఒత్తిడి చేయడం సరికాదు. ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తాం.

తాత్కాలిక సర్వేయర్లను నియమించాలి

- రెగ్యులర్ ఏఈవో

కేంద్ర ప్రభుత్వం డిజిటల్ పంట సర్వేకు కావలసిన నిధులను రాష్ట్ర ప్రభుత్వాలకు విడుదల చేసింది. ప్రతి వెయ్యి ఎకరాలకు ఒకరు చొప్పున తాత్కాలిక సర్వేయర్లను నియమించుకుని వంద శాతం కచ్చితత్వంతో పంటల సర్వే చేయించమని రాష్ట్రాలకు సూచించింది. మన రాష్ట్రంలో కేవలం 2600 మంది ఏఈవోలతోనే ఈ సర్వే చేయించడం అసాధ్యం. తాత్కాలిక సర్వేయర్లను నియమించాలి.

గరీబోళ్ల సూపర్ మార్కెట్



- ● గంగాధర అంగడిది ఐదు దశాబ్దాల చరిత్ర
- ● తాజా కూరగాయలు..
- ● భారీగా పశువుల అమ్మకాలు

- గంగాధర, ఆంధ్రజ్యోతి

7

ఆర్టీసీకి దసరా



- ● కరీంనగర్ రీజియన్‌కు రూ. 31.50 కోట్ల ఆదాయం

- భగత్‌నగర్, ఆంధ్రజ్యోతి

7

పత్తి కొనుగోళ్లకు సీసీఐ సిద్ధం



- ● ఏడు మిల్లులను నోటిఫై చేసిన అధికారులు

- జమ్మికుంట, ఆంధ్రజ్యోతి

7

నిష్పక్షపాతంగా విచారణ జరపండి

● సీపీని కలిసిన ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కరీంనగర్ క్రైం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ నాయకులపై నమోదైన ఎస్సీ ఎస్టీ కేసుల్లో నిష్పక్షపాతంగా విచారణ జరిపి న్యాయం చేయాలని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ సీపీకి విజ్ఞప్తి చేశారు. గురువారం సాయంత్రం కార్పొరేటర్లతో కలిసి ఎమ్మెల్యే సీపీని కలిశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎస్సీ ఎస్టీ కేసు నమోదైన మేయర్‌ను ఎందుకు అరెస్టు చేయడంలేదని కొందరు కాంగ్రెస్ నాయకులు ఏసీపీలపై ఒత్తిడి తీసుకువస్తున్నారని, డిప్యూటీ మేయర్ హరిశంకర్‌పై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని పోలీసులపై ఒత్తిడి తీసుకు వస్తున్నారని విమర్శించారు. కరీంనగర్‌లో బీఆర్‌ఎస్ బలంగా ఉండ డంతో రాజకీయ లబ్ధి కోసం అక్రమ కేసులు పెట్టే ప్రయత్నాలు జరుగు తున్నాయన్నారు. పోలీస్ కమిషనర్‌పై తమకు పూర్తి నమ్మకముందని, నిష్పక్షపాత విచారణ జరపాలని కోరామని, ఇందుకు సీపీ సానుకూలంగా స్పందించారన్నారు. ఎలాంటి పక్షపాతం లేకుండా విచారణ జరుపుతామని సీపీ హామీ ఇచ్చారన్నారు. చట్టంపై, న్యాయంపై నమ్మక ముందన్నారు. రాజకీయనాయకుల ఒత్తిడితో కేసులు పెడితే ప్రభుత్వాలు మారినప్పుడు అధికారులే బాధ్యతవహించాల్సి ఉంటుందన్నారు. ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని గౌరవిస్తామని, ఆ వర్గాలను దూషిస్తే చట్టపరంగా చర్యలు తీసుకోవాలని తామే కోరుతామన్నారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో కాంగ్రెస్, బీజేపీ నాయకులపై ఎక్కడా కేసులు పెట్టలేదని ఎమ్మెల్యే అన్నారు. అభివృద్ధి చేయాలని ప్రజలు కాంగ్రెస్‌పార్టీకి అధికారమిచ్చారని, 9 నెలల్లో కరీంనగర్‌లో ఏమి అభివృద్ధి చేశారని ఎమ్మెల్యే ప్రశ్నించారు. కేముల్ బ్రిడ్జి విద్యుత్‌దీపాలు వెలగడం లేదని, బ్రిడ్జిపై తారు లేచిపోయిందని, ఐలాండ్‌ల చుట్టూ గుంతలు ఏర్పడ్డాయని తెలిపారు. అభివృద్ధి పనులన్నీ అర్ధాంతరంగా నిలిచిపోయాయని, కాంట్రాక్టర్లకు బిల్లులు ఇప్పించి పెండింగ్ పనులు పూర్తి చేయాలని కోరారు. పెండింగ్ పనులపై సీఎంను కూడా కలుస్తామన్నారు. బీఆర్‌ఎస్ పెద్దపార్టీ, తెలంగాణను తీసుకువచ్చిన పార్టీ అని, నాయకుల మధ్య మనస్పర్థలు వస్తాయి, అన్ని సమసిపోతాయన్నారు. అధికారంలోకి తొమ్మిది నెలలకే మంత్రులు, ఎమ్మెల్యేలు కొట్లాడుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థిపై కేసీఆర్ నిర్ణయం తీసుకుంటారని, అందరం కలిసికట్టుగా పనిచేసి అభ్యర్థిని గెలిపించుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. సమావేశంలో కార్పొరేటర్లు ఐలేందర్‌యాదవ్, మహేష్, శ్రీకాంత్, రాములు, సాగర్, బీఆర్‌ఎస్ నాయకుడు గందె మహేష్ పాల్గొన్నారు.



పోలీస్ హెడ్ క్వార్టర్స్ బయట మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్

● పెండింగ్ పనులు పూర్తి చేయించండి

కరీంనగర్ టౌన్: కరీంనగర్‌లో గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ కలెక్టర్‌ను కోరారు. గురువారం ఈమేరకు గంగుల కమలాకర్ కలెక్టర్ పమేలా సత్పతిని కలిసి కరీంనగర్ నియోజకవర్గ సమస్యలు, అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై చర్చించారు. స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులో భాగంగా పద్మనగర్ బైపాస్‌రోడ్డులో అన్నమయ్య జంక్షన్ నిర్మాణానికి టెండర్లు నిర్వహించారని, ఇప్పటికీ ఆ పనులు ప్రారంభించలేదని, పనులు వెంటనే ప్రారంభించేలా మున్సిపల్ అధికారులకు ఆదేశాలివ్వాలని కోరారు. ఎల్‌ఎండీ నిర్మాణంతో ముంపునకు గురైన హస్నాపూర్ గ్రామస్తుల్లో చాలా మందికి ఇళ్ల పట్టాలివ్వలేదని, వారికి ఇళ్ళ పట్టాలిచ్చి న్యాయం చేయాలని కోరారు.

ఫీజు రీ యింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలి

గణేశ్‌నగర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మూడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని కోరుతూ డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాలు, సిబ్బంది ఆధ్వర్యంలో గురువారం తెలంగాణ చౌక్‌లో మనవహారం నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ వరకు ర్యాలీగా వెళ్లి జిల్లా రెవిన్యూ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. ముఖ్యమంత్రిని కలుద్దామని ఎన్నిసార్లు ప్రయత్నించినా సమయం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విధిలేని పరిస్థితుల్లో కళాశాలల్లో నిరవధిక బంద్ చేయాలని నిర్ణయించామన్నారు. ప్రభుత్వం నిధులు విడుదల చేసే వరకు కళాశాలలు తెరవబోమని వారు స్పష్టం చేశారు. కార్యక్రమంలో శాతవాహన యూనివర్సిటీ ప్రైవేట్ డిగ్రీ, పీజీ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎం వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ఎస్ నరేష్, డిగ్రీ కళాశాలల జిల్లా కో ఆర్డినేటర్ గోవిందవరం కృష్ణ, రవీందర్‌రెడ్డి, వేణు, సతీష్ కుమార్, ప్రిన్సిపాల్స్ వర్మ, ఎల్ శ్రీనివాస్, వేణుగోపాల్‌రెడ్డి, చైతన్య, మనోహర్, చంద్రశేఖర్‌రెడ్డి, నరేష్, సీహెచ్ శ్రీనివాస్, జి శ్రీనివాస్ పాల్గొన్నారు.



తెలంగాణ చౌక్ వద్ద మానవహారంగా ఏర్పడ్డ చేస్తున్న ప్రైవేట్ డిగ్రీ పీజీ కళాశాలల యాజమాన్యాలు, అధ్యాపకులు



తిమ్మాపూర్ మండలం మన్నెంపల్లిలో నేలకొరిగిన వరి పంట

దంచి కొట్టిన వాన

- ● నేలవాలిన వరి ● పొలాల్లోకి చేరిన నీరు

తిమ్మాపూర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా గురువారం తెల్లవారుజామున ఈదురు గాలులతో భారీ వర్షం కురిసింది. పలు గ్రామాల్లో వరి పంట నేల వాలింది. మండలంలోని మన్నెంపల్లి, మల్లాపూర్‌లో పొలాల్లోకి నీరు చేరింది. రెండు, మూడు రోజులపాటు వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. వరి కోతలు ప్రారంభ అవుతున్నదశలో వర్షాలు కురుస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇలానే వర్షాలు పడితే హార్వెస్టర్లు పంట పొలాల్లోకి దిగలేని పరిస్థితి ఏర్పాడుతుంది. వరి నేలకొరిగిన పొలాల్లో ఉన్న నీటిని తీసివేయాలని వ్యవసాయాధికారులు సూచించారు. పొలంలో ఉప్పు చల్లితే తిరిగి పంట యాథ స్థితికి వస్తుందని వారు తెలిపారు.



గన్నేరువరం మండలంలో వర్షానికి తడిసిన వడ్లను ఆరబెడుతున్న రైతు

● వర్షానికి తడిసిన ధాన్యం

గన్నేరువరం: మండల కేంద్రంలో గురువారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి ఐకేపీ కొనుగోలు కేంద్రంలోని ధాన్యం తడిసిపోయి వరదకు కొట్టుకుపోయింది. కేంద్రం నిర్వాహకులు టార్పాలిన్లు ఇవ్వకపోవడంతో ధాన్యం తడిసిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలని రైతులు డిమాండ్ చేశారు.

క్రైం కార్నర్

పిడుగుపాటుకు రైతు మృతి



నర్సింహారెడ్డి

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లిలోని రైతు కామిడి నర్సింహారెడ్డి (50) అనే రైతు పిడుగుపాటుకు గురువారం మృతి చెందాడు. బండలింగంపల్లికి చెందిన నర్సింహారెడ్డి పొలం వద్ద పాడి గేదెలను పెంచుతున్నాడు. గురువారం వేకువజామున పొలం వద్దకు వెళ్లి పాడి గేదెల పాలు పితికాడు. కాళ్లు, చేతులు కడుకుంటున్న క్రమంలో ఉరుములు, మెరుపులతో ఒక్కసారిగా పిడుగు పడడంతో అక్కడికక్కడే చనిపోయాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. నర్సింహారెడ్డికి భార్య చంద్రకళ, కొడుకు అజయ్ ఉన్నారు. మృతుడి కుటుంబాన్ని స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు పరామర్శించారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరారు.

మద్యం మత్తులో ఒకరి ఆత్మహత్య

కోల్‌సిటీ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని సప్తగిరికాలనీలో నివాసముండే సొన్నాయిల రమేష్(60) అనే వ్యక్తి బుధవారం రాత్రి మున్సిపల్ జంక్షన్ సమీపంలోని జిమ్ వద్ద చెట్టుకు ఉరి వేసుకున్నాడు. సన్నటి వైరుతో ఉరి వేసుకోవడంతో అది తెగి కింద పడగా తలకు తీవ్ర గాయాలయ్యాయి. గురువారం తెల్లవారు జామున వాకింగ్‌కు వెళ్లేవారు చూసి 108కు ఫోన్‌చేయగా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే అతడు మృతిచెందినట్టు వైద్యులు పేర్కొన్నారు. రమేష్ బస్టాండ్ వద్ద సెలూన్ నడుపుకుంటూ జీవించేవాడు. కొంత కాలంగా రమేష్ మద్యానికి బానిసై మద్యం మత్తులో ఈనెల 16న ఉదయం ఇంట్లో నుంచి ఎవరికీ చెప్పకుండా వెళ్లాడు. రాత్రివరకు వెతికినా ఆచూకీ కనబడలేదు. గురువారం చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు వన్‌టౌన్ పోలీసులు పేర్కొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

సిరిసిల్ల క్రైం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని ఎల్లమ్మ దేవాలయం పక్కన మానేరు కరకట్ట వద్ద గురువారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైందని టౌన్ సీఐ కృష్ణ తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 45 సంవత్సరాలు ఉంటుందని, మెడలో పసుపు రంగు దారం, కుడిచెయికి రాగి కడెం ధరించి ఉన్నాడని పేర్కొన్నారు. మృతదేహాన్ని సిరిసిల్ల ప్రభుత్వాస్పత్రి మార్చురీలో భద్రపరిచినట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

సిరిసిల్ల క్రైం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని చంద్రంపేటకు చెందిన వేముల రాజశేఖర్(27) అనే యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. రాజశేఖర్ చిన్నబోనాల బైపాస్ రహదారిపై ఈనెల 13న అర్ధరాత్రి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా రహదారిపై ఆరబెటిన వడ్లపై జారి కిందపడ్డాడు. దీంతో తీవ్రంగా గాయపడిన రాజశేఖర్‌కు నాలుగు రోజులుగా కరీంనగర్ ఆసుపత్రిలో చికిత్స పొందాడు, పరిస్థితి విషమించి గురువారం చనిపోయాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ కృష్ణ తెలిపారు.

ఏటీఎంలో చోరీకి యత్నించిన వ్యక్తి అరెస్టు

సిరిసిల్ల క్రైం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి):సిరిసిల్ల పట్టణంలోని సంజీవయ్యనగర్‌లో ఎస్‌బీఐ ఏటీఎంలో చోరీకి యత్నించిన కరీంనగర్ సమీపంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన ఆకుబత్తిని శ్రీకాంత్ (38)ను గురువారం అరెస్ట్ చేశామని టౌన్ సీఐ కృష్ణ తెలిపారు. ప్రస్తుతం సిరిసిల్లలో ఉంటున్న శ్రీకాంత్ గురువారం ఏటీఎం గదిలో సీసీ కెమెరాలను సీలింగును సుత్తితో పగులగొట్టి దొంగతనానికి యత్నించాడని తెలిపారు. ఐదు గంటల వ్యవధిలోనే సీసీ కెమెరాల ఫుటేజీల ఆధారంగా పట్టుకొని రిమాండ్‌కు తరలించామన్నారు.

దొంగిలించిన ట్రాక్టర్ పట్టివేత

- వివరాలు వెల్లడించిన పెద్దపల్లి ఏసీపీ గజ్జి క్రిష్ణ



జూలపల్లిలో విలేకరులతో మాట్లాడుతున్న ఏసీపీ గజ్జి కృష్ణ

జూలపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చీమలపేట గ్రామానికి చెందిన ఏముండ్ల అనిల్ అనే రైతు ట్రాక్టర్‌ను ఐదు నెలల క్రితం గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు గురువారం ఎలిగేడు మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామశివారులో పట్టుకున్నారు. జూలపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ వివరాలను వెల్లడించారు. చొప్పదండి మండలం చాకుంట గ్రామానికి చెందిన జాతరగొండ అశోక్, జాతరగొండ శేఖర్ అనే వ్యక్తులు ట్రాక్టర్‌ను దొంగిలించి కొంతకాలం పాటు బయటకు తీయకుండా దాచి ఉంచారు. బాధితుడి ఫిర్యాదు మేరకు జూలపల్లి ఎస్ఐ శ్రీధర్ ఆధ్వర్యంలో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈక్రమంలో ఇంతకాలం దుండగులు దొంగిలించిన ట్రాక్టర్‌ను తమ పొలం వద్దనే దాచిపెట్టి గురువారం ఎలిగేడు మండలం సుల్తాన్‌పూర్ గ్రామం నుంచి గర్రెపల్లికి తరలిస్తుండగా అదే సమయంలో వాహనాలు తనిఖీ చేస్తున్న జూలపల్లి పోలీసులు ట్రాక్టర్‌ను గుర్తించారు. దుండగులు ట్రాక్టర్‌ను వదిలి పారిపోతుండగా వారిని పట్టుకొని విచారించగా నేరాన్ని ఒప్పుకున్నట్లు ఏసీపీ తెలిపారు. ఈ సమావేశంలో సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి, ఇన్‌చార్జి ఎస్ఐ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వీసా పేరిట మోసం చేసిన వ్యక్తి అరెస్టు

బోయినపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గల్ఫ్‌లో ఉపాధి అవకాశం కల్పిస్తానని మోసం చేసిన వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు వేములవాడ రూరల్ సీఐ ఎం శ్రీనివాస్ తెలిపారు. వివరాల ప్రకారం బోయినపల్లి మండలం కోరెం గ్రామానికి చెందిన ముదాం వెంకటేష్ అనే వ్యక్తిని జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం చెందిన దండుగుల కళ్యాణ్ వర్క్ వీసాపై గల్ఫ్ దేశానికి పంపిస్తానని రూ.75 వేలుతీసుకున్నాడు. అయితే వెంకటేష్‌ను పంపని వీసాపై కాకుండా టూరిస్ట్ వీసాపై గల్ఫ్‌కు పంపించాడు. వెంకటేష్ ఇంటికి తిరిగి వచ్చి మోసం చేసిన కల్యాణ్‌పై ఎస్సై పృథ్వీధర్‌గౌడ్‌కు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దండుగుల కల్యాణ్‌ని బుధవారం అరెస్ట్‌కు పంపినట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు.

దాడికి పాల్పడిన ఇద్దరికి ఏడాది జైలు

సుల్తానాబాద్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కర్రలతో దాడి చేసి గాయపరిచిన ఇద్దరు వ్యక్తులకు ఏడాది జైలు శిక్షతో పాటు ఐదు వందల రూపాయల జరిమానా విధిస్తూ సుల్తానాబాద్ జూనియర్ కోర్టు జడ్జి దుర్గం గణేష్ గురువారం తీర్పు చెప్పారు. ఎస్ఐ శ్రావణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సుల్తానాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని శాస్త్రీనగర్‌కు చెందిన కాంపల్లి శ్రీహిత కరీంనగర్‌లో నివాసం ఉంటూ దీపావళి పండుగకు తల్లిదండ్రుల వద్దకు వచ్చింది. ఇంటి పక్కనున్న కల్వల లక్ష్మయ్య, కల్వల వినీష్ అనే వ్యక్తులు 7 నవంబర్ 2018న రాత్రి తొమ్మిది గంటల ప్రాంతంలో టపాసులు శ్రీ హిత ఇంటిలో వేయగా కుటుంబ సభ్యులు ఇదేంటని అడిగారు. దీంతో ఆగ్రహించిన నిందితులు కర్రలతో శ్రీహిత కుటుంబ సభ్యులపై దాడి చేయగా తలలకు గాయాలయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ రాజేశ్ కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. కోర్టు కానిస్టేబుల్ దేవరాజ్ సాక్షులను ప్రవేశపెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్యామ్‌ప్రసాద్‌రావు, ఎస్ఐ శ్రావణ్‌కుమార్‌లు విచారణ జరిపారు. ఈ నేపథ్యంలో జడ్జి నిందితులకు ఏడాది జైలుశిక్షతో పాటు ఐదు వందల జరిమానా విధించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ఇల్లందకుంట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టేకుర్తి మీదుగా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఆరు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్ఐ రాజకుమార్ తెలిపారు. గురువారం ఉదయం జమ్మికుంట మండలంలోని విలాసాగర్ నుంచి టేకుర్తి మీరుగా సన్ని, అశోక్, రాజ్‌కుమార్, రమేశ్, అంజి, రమేశ్ ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు.

ఆదర్శం

తాము మరణించినా..
మరొకరికి జీవం పోస్తూ..

అవయవ దానానికి ముందుకు వస్తున్న కుటుంబాలు

- ఉమ్మడి జిల్లాలో అవయవదానంపై పెరిగిన అవగాహన
- ప్రజల్లో చైతన్యం కల్పిస్తున్న సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు
- అవయవ దానానికి 60వేల మంది అంగీకారం...



మృతదేహం వద్ద సెల్యూట్ చేస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

కోల్‌సిటీ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : "అమ్మ జన్మనిస్తే అవయవదానం పునర్జన్మనిస్తుంది.. మరణించినా కళ్లు మాత్రం ఈ లోకాన్ని చూస్తూనే ఉంటాయి.. మూత్రపిండాలు రక్తాన్ని శుద్ధి చేస్తూనే ఉంటాయి... శ్వాస ఆగిపోయినా గుండె మాత్రం కొట్టుకుంటూనే ఉంటుంది.. ఆయువు పోయినా.. అవయదానంతో ఊపిరిపోద్దాం.. అవయవాలను ఈ లోకంలో జీవించనిద్దాం... రండి అవయదానం చేద్దాం... మరణించినా మరమరొకరి దేహంలో జీవించే ఉందాం.." అంటూ గోదావరిఖనిలో 17ఏళ్ల క్రితం పురుడుపోసుకున్న 'సదాశయ ఫౌండేషన్' సంస్థ ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు విస్తృతంగా ప్రచారం చేస్తోంది... వేలాది మంది అవయవదాన బాట పట్టిస్తున్నది... కుటుంబ సభ్యులు అవయవాలే కాకుండా దేహదానాలకు కూడా ముందుకు వస్తున్నారు...

● ఉమ్మడి జిల్లాలో 'సదాయశ' కార్యక్రమాలు...

సదాశయ ఫౌండేషన్ సంస్థ ప్రతినిధులు అవయవదానంపై చేస్తున్న కృషికి.. కరీంనగర్ ఉమ్మడి జిల్లాతో పాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ప్రజలు అవయవదానంపై స్పందిస్తున్నారు. ఇందులో మహిళలు, యువతనే ఎక్కువగా ఉంటుంది. పుట్టెడు దుఃఖంలో ఉండి కూడా మృత్యువుకు చేరువలో ఉన్న వ్యక్తి అవయవాలను దానం చేయడానికి కుటుంబ సభ్యులు ముందుకు వస్తున్నారు. పార్థివదేహం కాలిబూడిదై మట్టిలో కలిసిపోకుండా ఉండేందుకు, వైద్య విద్యార్థుల పరిశోధన కోసం ఉపయోపడేలా మృతదేహాన్ని కూడా అప్పగించి ఆదర్శంగా నిలుస్తున్నారు. నేత్రదానం చేసి అంధులకు వెలుగులు ప్రసాదిస్తున్నారు.

సదాశయ ఫౌండేషన్ ద్వారా..

నేత్రదానం చేసిన వారు	1196
అవయవదానం చేసిన వారు	88
మెడికల్ కాలేజీలకు దేహదానం చేసిన వారు	125
అవయవదానంపై అవగాహన సదస్సులు	1315
అవయవదానం చేస్తామని అంగీకారం తెలిపిన వారు	60 వేలు



దేహదానానికి కలెక్టర్‌కు అంగీకార పత్రం అందజేస్తున్న జర్నలిస్టు వాసు(ఫైల్)



తమ్ముడి కళ్లను ఐ బ్యాంకుకు దానం చేస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్(ఫైల్)

● అవయవాలను ఇలా సేకరిస్తారు..

కుటుంబ సభ్యుల అంగీకారంతో బ్రెయిన్డెడ్ అయిన పేషెంట్ నుంచి అవయవాలను తీసిన తర్వాత, వాటి నాణ్యతను బట్టి నిబంధనల ప్రకారం ఆయా ఆసుపత్రులకు జాగ్రత్తగా తరలిస్తారు. కొన్ని సందర్భాల్లో గ్రీన్ ఛానల్ కూడా ఏర్పాటు చేసి గుండెను రోడ్డు మార్గంలో తరలిస్తారు.

● అవయవాల కోసం...

అవయవాలు కావాల్సిన వారు ముందుగా జీవన్‌దాన్ కేంద్రంలో పేరు, పేషెంట్ బ్లడ్ గ్రూప్, ఏ అవయవమో నమోదు చేయించుకోవాలి. ఆరోగ్యశ్రీ కార్డు అర్హులకు ఉచితంగా, మిగితా వారికి కొంత రుసుం చెల్లించాల్సి ఉంటుంది. మరణానంతరం అవయవదానం చేయాలని కోరుకునేవారు, జీవన్‌దాన్ సంస్థతో పాటు కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో అవయవదానంపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్న సదాశయ ఫౌండేషన్, లయన్స్ క్లబ్ సంస్థల దగ్గర పేర్లను నమోదు చేయించుకోవచ్చు.

బతికున్న వారు దానం చేసే అవయవాలు..

- ఒక కిడ్నీ
- 1/4 వంతు కాలేయం
- ఎముక మజ్జ కణజాలం

మనిషి మరణానంతరం దానం చేసేవి...

శరీరంలోని 200 అవయవాలు, కణజాలం దానం చేయవచ్చు. ముఖ్యమైన కండ్లు, గుండె, గుండె కవాటాలు, కాలేయం, మూత్రపిండాలు, ఊపిరితిత్తులు, క్లోమం, పెద్ద పేగు, చిన్న పేగు, రక్తనాళాలు, చెవిలోని కర్ణభేరి, ఎముకలు, మూలుగను తదితర వాటిని మృతుల నుంచి తీసుకుంటారు. ఇలా ఒక వ్యక్తి నుంచి సేకరించిన అవయవాలతో ఏడు నుంచి తొమ్మిది మందికి పునర్జన్మను ప్రసాదించే అవకాశం ఉందని వైద్య నిపుణులు వెల్లడిస్తున్నారు.

అవగాహన కల్పిస్తున్న సంస్థలు

- సదాశయ ఫౌండేషన్
- లయన్స్ క్లబ్
- తెలంగాణ నేత్ర, అవయవ, శరీరదాతల సంఘం.

అవయవ దాతలు, అవగాహన కల్పిస్తున్న సంస్థలను ప్రభుత్వం గౌరవించాలి..

- టీ శ్రవణ్ కుమార్, సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు



నేత్ర, అవయవ, శరీర దానాలపై అవగాహన కల్పిస్తున్న సంస్థలు, అవయవ దాతలను ప్రభుత్వం, జీవం దాన్ సంస్థ గౌరవించాలి. మరణాంతరం నేత్రాలు, అవయవాలు వృథా పోనీయకుండా ఫ్రాన్స్, ఆస్ట్రియా, స్పెయిన్, శ్రీలంక తరహాలో మన దగ్గర ప్రభుత్వ లాంఛనాలతో అవయవదాతకు అంత్యక్రియలు నిర్వహించడం, కుటుంబానికి ప్రశంసాపత్రం, రూ.10వేలు ఆర్థికసాయం ఇచ్చేలా ఏపీ రాష్ట్రం స్ఫూర్తిదాయకమైన నిర్ణయం తీసుకుంది. అవయవదానంలో ప్రథమ స్థానంలో ఉన్న తెలంగాణ రాష్ట్రంలో అమలు చేయాలి.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

కరీంనగర్ క్రైం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం మొగ్దుంపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం లాలపల్లెకు చెందిన గుర్రం మల్లారెడ్డి(41) అనే వ్యక్తి దుర్మరణం చెందాడని కరీంనగర్ రూరల్ పోలీసులు తెలిపారు. మల్లారెడ్డి కరీంనగర్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. విధులు ముగించుకొని రాత్రి కరీంనగర్ నుంచి లాలపల్లెకు బైక్‌పై వెళ్తుండగా వెనుక నుంచి కారు ఢీకొనడంతో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడని తెలిపారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. ప్రమాదానికి కారణమైన కారును గర్రెపల్లి వద్ద స్థానిక యువకులు పట్టుకున్నారు.

ఆస్తి కోసం భార్య, అల్లుడి ఘాతుకం

- హత్య చేసి.. సహజ మరణంగా చిత్రీకరణ
- నిందితుల అరెస్టు

కోల్‌సిటీ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ఐబీ కాలనీలో సెప్టెంబర్ 16న మృతి చెందిన సింగరేణి కార్మికుడు బానోత్ హరిసింగ్(60) సహజ మరణం కాదని, హత్యగా పోలీసులు తేల్చారు. ఆస్తి కోసం కట్టుకున్న భార్య దస్లి, చిన్న కూతురు సునీత భర్త రొంటాల నరేష్‌లు ఘాతుకానికి పాల్పడినట్టు పోలీసులు తేల్చారు. మొదట అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు పోస్టుమార్టం నివేదికలో మెడ ఎముకలు విరగడం, ఛాతిపై, కాలుపై గాయాలతో మృతిచెందినట్టు నివేదికలో పేర్కొన్నారు. దీంతో అప్పటికే మృతుని కుమారుడు వెంకటేష్ ఫిర్యాదుతో భార్య దస్లి, నరేష్‌ల పాత్రపై విచారణ జరుపుతున్న పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారించడంతో అసలు విషయం ఒప్పుకున్నారు. హరిసింగ్‌కు భార్య, ఒక కుమారుడు వెంకటేష్, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. చిన్న కూతురు సునీత గోదావరిఖనికి చెందిన నరేష్‌ను ప్రేమ వివాహం చేసుకున్నది. దీంతో తనకు ఇష్టం లేని పెళ్లి చేసుకున్నదని హరిసింగ్ కూతురు, అల్లుడిని ఇంటికి రానివ్వలేదు. సింగరేణి కార్మికుడైన అల్లుడు నరేష్ మద్యానికి బానిసై డ్యూటీలు చేసేవాడు కాదు. హరిసింగ్ సెప్టెంబర్‌లో రిటైర్డ్ అవుతుండడంతో పదవీ విరమణ తరువాత డబ్బులు వస్తాయని, అవి తమకు ఇవ్వకుండా కొడుకు, పెద్ద కూతురుకే ఇస్తారని భావించారు. సునీత తన తల్లి దస్లితో ఇదే విషయమై మూడు నెలలుగా చెబుతోంది.. కూతురుకు డబ్బులు ఇవ్వాలని దస్లి తన భర్త హరిసింగ్‌కు చెప్పగా ఆయన తిరస్కరించారు. దస్లి పేర ఖమ్మంలో రూ.70లక్షల విలువైన ఇంటి స్థలం ఉంది. ఇది కాకుండా హరిసింగ్, దస్లి జాయింట్ అకౌంట్‌లో రూ.4లక్షల నగదు ఉన్నాయి. హరిసింగ్‌ను కడతేర్చితే డబ్బులు వస్తాయని, ఇంటి స్థలం కూడా అమ్ముకోవచ్చునని భావించారు. సెప్టెంబర్ 16న గణపతి నిమజ్జనం కావడం, ఆరోగ్యం బాగా లేక హరిసింగ్ ఇంట్లో పడుకోవడంతో దస్లి తన కూతురు సునీతకు ఫోన్ చేసి నరేష్‌ను పంపమని పేర్కొన్నది. పథకం ప్రకారం ఇంటికి వచ్చిన నరేష్ నిద్రలో ఉన్న హరిసింగ్ మెడకు వైరు బిగించాడు. భార్య దస్లి దిండుతో హరిసింగ్ ముఖంపై శ్వాస ఆడకుండా అదిమింది. దీంతో అతడు మృతి చెందాడు. కొద్ది సేపటికి బయటకు వచ్చి తన భర్త కదలడం లేదని, అనారోగ్యం బారిన పడ్డాడంటూ స్థానికులను నమ్మించింది. ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు పేర్కొన్నారు.

ఈ ఘటనపై హరిసింగ్ కుమారుడు వెంకటేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మరణంగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు పోస్టుమార్టం నివేదిక ఆధారంగా దానిని హత్య కేసుగా మార్చినట్టు సీఐ ఇంద్రసేనారెడ్డి పేర్కొ న్నారు. నిందితులు బానోతు దస్లి, రొంటాల నరేష్‌లను గురువారం అరెస్టు చేసినట్టు ఆయన పేర్కొన్నారు.

రాయపట్నం వద్ద ఆటో బోల్తా

● బైక్ ఢీకొని ఇద్దరికి గాయాలు

ధర్మపురి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలోని రాయపట్నం రహదారి వద్ద ఒక ఆటో బోల్తాపడి బైక్ ఢీకొట్టడంతో గురువారం మేడిశెట్టి వెంకటయ్య, మైదం అశోక్ అనే ఇద్దరు వ్యక్తులు గాయ పడ్డారు. మండలంలోని నాగారం గ్రామానికి చెందిన వెంకటయ్య, అశోక్ తన ద్విచక్ర వాహనంపై మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట నుంచి ధర్మపురి వైపు బయలు దేరారు. ఆ సమయంలో ఆవు దూసు కు రావడంతో ధర్మపురి నుంచి రాయపట్నం వైపు వెళుతున్న ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. వెంటనే ద్విచక్ర వాహనం ఆటోను ఢీకొట్టడంతో ఇద్దరూ కింద పడి గాయపడ్డారు. ఆటో డ్రైవర్ కూడా గాయపడినట్లు తెలుస్తోంది.



బోల్తా పడిన ఆటో

ఎన్టీపీసీలో మరిన్ని సౌర వెలుగులు

● రామగుండంలో మరో 176 మెగావాట్ల సోలార్ విద్యుత్ విస్తరణ ● రూ.800 కోట్లతో కొత్త ప్రాజెక్టు

● ఇప్పటికే 100 ఫ్లోటింగ్, 10 మెగావాట్ల సర్ఫేస్ సోలార్ విద్యుత్



దేశంలోనే అతిపెద్ద ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టు



10 మెగావాట్ల సర్ఫేస్ సోలార్ ప్రాజెక్టు

జ్యోతినగర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : రామగుండంలోని ఎన్టీపీసీలో మరిన్ని సౌర వెలుగులు రానున్నాయి. 4200 మెగావాట్ల థర్మల్ విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్న ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీ(సాంప్రదాయేతర)పై దృష్టి సారించింది. దీనిలో భాగంగా ఇప్పటికే 10 మెగావాట్ల సర్ఫేస్ సోలార్, 100 మెగావాట్ల ఫ్లోటింగ్(నీటిలో తేలియాడే) సోలార్ విద్యుత్ ప్రాజెక్టులను ఎన్టీపీసీ నెలకొల్పింది. ఈక్రమంలో సౌర విద్యుత్ విస్తరణకు సిద్ధమైంది. దీనిలో భాగంగా ఎన్టీపీసీ రిజర్వాయర్‌లో 56 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్, పక్కనే ఉన్న స్థలంలో మరో 120 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టులు నిర్మించనున్నది. ఇప్పటికే 176 మెగావాట్ల ప్రాజెక్టుకు సంబంధించి టెండర్ల ప్రక్రియ పూర్తయి లాంఛనంగా నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. ఇప్పటికే 100 మెగావాట్ల దేశంలోనే అతిపెద్ద ఫ్లోటింగ్ సౌర ప్రాజెక్టును నిర్వహిస్తున్న ఎన్టీపీసీ మరో 56 మెగావాట్ల ఫ్లోటింగ్ సౌర విద్యుత్ యూనిట్‌తో మరో రికార్డు సృష్టించనున్నది.

● త్వరలో ప్రధాని మోదీతో శంకుస్థాపన

సుమారు 800 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న 176 మెగావాట్ల సౌర(ఫ్లోటింగ్, సర్ఫేస్)విద్యుత్ ప్రాజెక్టుకు త్వరలో ప్రధాని నరేంద్ర మోదీ శంకుస్థాపన చేయనున్నారు. దేశ వ్యాప్తంగా వివిధ ఎన్టీపీసీ ప్రాజెక్టుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్న ప్రధాని వర్చువల్‌గా ఇక్కడి సోలార్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేస్తారని సమాచారం. ఈ ప్రాజెక్టుకు సంబంధించి ఎల్అండ్‌టీ సంస్థకు నిర్మాణ కాంట్రాక్టు లభించగా, ప్రాజెక్టుకు అవసరమైన సోలార్ ప్యానళ్లు ఇతర ఉపకరణాలు ఇక్కడికి చేరుకున్నాయి.

తెరుచుకున్న శ్రీరాంసాగర్ గేట్లు

జగిత్యాల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతం నుంచి వరద ఎక్కువగా వస్తుండడంతో గురువారం శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు చెందిన గేట్లను అధికారులు తెరిచారు. ప్రాజెక్టుకు చెందిన మూడు గేట్లను తెరిచి 9,372 క్యూసెక్కుల నీటిని దిగువకు గోదావరిలోకి వదులుతున్నారు. ఎగువ ప్రాంతం నుంచి ప్రాజెక్టులోకి 18,826 క్యూసెక్కుల నీరు వస్తోంది.

బతికెపల్లిలో ఒకరి ఆత్మహత్య

పెగడపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పెగడపల్లి మండలంలోని బతికెపల్లి గ్రామానికి చెందిన పోచంపల్లి మల్లయ్య (56) అను వ్యక్తి అనారోగ్య సమస్యలతో కత్తితో గొంతులో పొడుచుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మల్లయ్య రెండేళ్లుగా లివర్, గుండె, కిడ్నీ సమస్యతో బాధపడుతున్నాడు. ఆరు నెలల క్రితం లివర్ చెడిపోయిందని వైద్యులు తెలిపారు. ఎన్ని ఆసుపత్రులు తిరిగినా వ్యాధి నయం కాకపోవడంతో మనస్థాపం చెంది ఇంట్లోనే ఆత్మహత్య చేసున్నట్లు తెలిపారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సీహెచ్.రవికిరణ్ తెలిపారు.

హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రిలో ఆడ శిశువు మృతదేహం లభ్యం

హుజూరాబాద్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రిలో గురువారం రాత్రి బాత్రూంలో ఆడ శిశువు మృతదేహం లభ్యమైంది. గుర్తు తెలియని మహిళ ఆడ శిశువును జన్మించిందనే ఉద్దేశంతో బాత్రూంలో పడేసి వెళ్లినట్లు తెలుస్తోంది. 24గంటలు వైద్యులు, జనం తిరుగుతూ ఉండే ఆస్పత్రిలో శిశువు లభ్యం కావడం చర్చనీయాంశంగా మారింది. ఎమర్జెన్సీ రూమ్‌లోని బాత్రూంను ఆస్పత్రి సిబ్బంది శుభ్రం చేయడానికి వెళ్లగా మృతి చెందిన ఆడ శిశువు కనబడింది. దీంతో వైద్యులకు విషయాన్ని తెలపడంతో, పోలీసులు విచారణ చేస్తున్నారు. కాగా వేరే ఆస్పత్రిలో అబార్షన్ చేయించుకొని ఈ ఆస్పత్రిలో పడేసినట్లు ఆనవాళ్లు ఉన్నట్లు వైద్యులు తెలుపుతున్నారు. ఏది ఏమైనా పోలీసులు లోతుగా విచారణ చేపడితే అసలు విషయాలు బయటకి వచ్చే అవకాశం ఉంది.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకం

-ఎస్సీ వర్గీకణ వ్యతిరేక పోరాట సమితి చైర్మన్ చెన్నయ్య

సుభాష్‌నగర్, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తున్నామని ఎస్సీ వర్గీకణ వ్యతిరేక పోరాట సమితి చైర్మన్ చెన్నయ్య, కో చైర్మన్ నల్లల కనకరాజు అన్నారు. గురువారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ అంశం రాజ్యాంగానికి ఆర్టికల్ 341కు, పార్లమెంట్‌కు వ్యతిరేకంగా ఉందన్నారు. సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. 2011 లెక్కలను వ్యతిరేకిస్తు న్నామన్నారు. 2014 నుంచి 2024 వరకు లెక్కలు తీస్తే ఎవరు అభివృద్ధి చెందారో, ఎవరు చెందలేదో తెలుస్తుందన్నారు. అభివృద్ధి చెందని వారికోసం ప్రభుత్వం ప్రత్యేకమైన ప్యాకేజీలు, బడ్జెట్‌ను కేటాయించాలని డిమాండ్ చేశారు. ఐదుగురు రిటైర్డ్ జడ్జిలతో జ్యుడీషియల్ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మాలలను చైతన్యం చేస్తూ, ప్రభుత్వానికి కనువిప్పు కలిగేలా నవంబరులో లక్షలాదిమందితో మాలల శక్తి ప్రదర్శన నిర్వహిస్తామని తెలిపారు. ముందుగా మాలల చైతన్య బస్సు యాత్రను చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో తాళ్లపల్లి రవి, రాంచందర్, మేడి రాజవీరు, కొరివి వేణుగోపాల్, ఆర్ష మల్లేశం, కరణం కిషన్, గోపోజు రమేశ్, కేశవులు, ఎర్రమల్ల రాములు, దాసరి దశరథం, మేడి అంజయ్య, బత్తుల ప్రదీప్, గంటల బట్టి అనమల్ల, మేడి మహేశ్, సానాది వెంకటేష్, బైరం కుమార్, బిట్ల ప్రవీణ్, తీట్ల ఈశ్వరి, గంటల రేణుక, శీలం పుష్పలత, ఆశ విజయ, మేకల రజనీ, బండ అనిత, మేదిని లక్ష్మి, జంగ లక్ష్మి, మేకల రజని, అపర్ణ, ఉరుమడ్ల లక్ష్మన్, ఎడ్ల లక్ష్మి, మాది శ్రీహరి, మల్లెపల్లి సుమలత ఉన్నారు.

ఇంట్లో శుభకార్యం ఉంది.. శనివారం గంగాధర అంగడికి పోవాలి.. గొర్లు, మేకలు అగ్గువకే దొరుకుతయి.. రైతులే తెస్తరు కదా.. కూరగాయలు మంచిగుంటయి.. మసాలా దినుసులూ తీసుకోవచ్చు.. ఏమన్నా మరిచిపోయిన చిన్న వస్తువులూ దొరుకుతయి.. ఇవీ గంగాధర మండలంలో వినిపించే మాటలు.. ఇక్కడ శనివారం జరిగే అంగడికి ఐదు దశాబ్దాల చరిత్ర ఉంది. చుట్టుపక్కల గ్రామాల వారికి ఏ వస్తువులు కావాలన్నా గంగాధర అంగడికే వస్తారు. అందుబాటు ధరల్లో అన్ని వస్తువులు లభించడంతో బడుగు జీవులు ఎక్కువగా వస్తుంటారు. దీంతో ఇది గరీబోళ్ల సూపర్‌మార్కెట్‌గా పేరు పొందింది..



గంగాధర వారసంతలో మసాల దినుసుల షాపు

గరీబోళ్ల సూపర్ మార్కెట్

- గంగాధర అంగడిది ఐదు దశాబ్దాల చరిత్ర
- తాజా కూరగాయలు..
- భారీగా పశువుల అమ్మకాలు

గంగాధర, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గంగాధర వారసంతది 50 ఏళ్ల చరిత్ర. మండల కేంద్రంలోని బ్లాక్ వద్ద ప్రతి శనివారం అంగడి జరుగుతుంది. ప్రస్తుతం విస్తరించిన సాంకేతికతతో ఇంటివద్దకే అన్ని వస్తువులు వస్తున్న కాలంలోనూ ఈ అంగడికి ఆదరణ ఏమాత్రం తగ్గలేదు. ఇక్కడ తాజా కూరగాయలు, ఇంటికి అవసరమయ్యే వస్తువులు, మసాలా దినుసులు, పండ్లు, బట్టలు, చిరుధాన్యాలు, తినుబండారాలు, ప్లాస్టిక్ వస్తువులు ఇలా ఒక్కటేమిటి అన్నీ లభిస్తాయి. రైతులకు అవసరమైన వస్తువులు అందుబాటు ధరలో దొరుకుతాయి. ఈ సంత ద్వారా గ్రామ పంచాయతీకి భారీగా ఆదాయం సమకూరుతోంది

● మేకలు, గొర్రెల కోసం ఇతర జిల్లాల నుంచి రాక

ఉమ్మడి జిల్లాలో మేకలు, పశువులకు గంగాధర అంగడిది పెట్టింది పేరు. పెళ్లిళ్లు, శుభకార్యాలకు అన్ని వర్గాల వారికి మేకలు, గొర్రెలు అందుబాటులో ఉంటాయి. ఆదిలాబాద్, నిజామాబాద్, వరంగల్, మహబూబ్‌నగర్, సిద్దిపేట, వరంగల్‌తోపాటు మహరాష్ట్ర నుంచి ఇక్కడికి మేకలు, గొర్రెలు, పశువుల అమ్మకాలు, కొనుగోళ్ల కోసం వస్తుంటారు. పాడి పశువుల విక్రయం జోరుగా సాగుతుంది. పెళ్లిళ్ల, పండగల సమయంలో ఒక్కో వ్యాపారి సుమారుగా వంద మేకలను అమ్ముతారు. చుట్టు పక్కల గ్రామాలకు చెందిన ఐదు వందల మంది పశువుల వ్యాపారం చేస్తూ ఉపాధి పొందుతున్నారు.

● రైతులే విక్రయదారులు

గతంలో ఊళ్లో ఇంటింటికి తిరిగి కూరగాయలు విక్రయించే వారు. ప్రస్తుతం గంగాధర వారసంతకు వచ్చేవారిని దృష్టిలో పెట్టుకుని రైతులే స్వయంగా తాజా కూరగాయలను విక్రయిస్తున్నారు. కూరగాయల వ్యాపారం రాత్రి ఏడు గంటల వరకు సాగుతుంది. ఉద్యోగులు, ప్రజలు, వ్యాపారులు ఎక్కువగా ఇక్కడి నుంచే వారానికి సరిపడా కూరగాయలు తీసుకెళుతుంటారు. అంగడిలో అల్లం, వెల్లుల్లి, ఉల్లిగడ్డ, మసాలా దినుసులు తక్కువ ధరలో దొరుకుతాయి.

● గ్రామ పంచాయతీకి రూ. 1.6 కోట్ల ఆదాయం

గంగాధర వారసంత 50 ఏళ్ల క్రితం కూరగాయలు, బట్టలు, చిన్న చిన్న వస్తువుల అమ్మకాలతో ప్రారంభమైంది. మెల్లిమెల్లిగా విస్తరించి జిల్లాలోనే రెండో పెద్ద సంతగా నిలిచింది. నాడు గ్రామ పంచాయతీకి ఏటా 150 రూపాయల ఆదాయం వచ్చేంది. ప్రస్తుతం అది 1.6 కోట్ల రూపాయలకు చేరింది. ఆదాయానికి తగినట్లు అంగడిలో సౌకర్యాలు కల్పించారు. కూరగాయలు, ఇతర వస్తువులు అమ్ముకునే వారికి రోడ్డు వెంట రేకుల షెడ్డును ఏర్పాటు చేశారు. పశువులకు ప్రత్యేకంగా అంగడి చుట్ట ప్రహరీ నిర్మించి వాహనాల నుంచి వాటిని దింపడానికి గద్దెలను ఏర్పాటు చేశారు.


సంతలో దుస్తులు కొనుగోలు చేస్తున్న మహిళ


విక్రయానికి వచ్చిన పశువులు


సంతలో కూరగాయల విక్రయం

సాహిత్య సృజనతో సమాజంలో శాంతి పరిమళిస్తుంది

అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్



ఎన్నీల ముచ్చట్లలో పాల్గొన్న అదనపు కలెక్టర్

పెద్దపల్లి కల్చరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సాహిత్య సృజనతో సమాజంలో శాంతి పరిమళిస్తుందని అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్‌ప్రసాద్‌లాల్ అన్నారు. గురువారం రాత్రి తన క్యాంప్ కార్యాలయంలో తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన 138 ఎన్నీల ముచ్చట్లు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్యామ్‌ప్రసాద్‌లాల్ మాట్లాడుతూ 12 సంవత్సరాలుగా ప్రతీ పౌర్ణమి ఒక రచయిత ఇంట్లో కవులందరూ కలిసి సామూహికంగా కవిత గానం చేయడం సాహిత్య చరిత్రలో గొప్ప అధ్యాయమన్నారు. నేటి పౌర్ణమి నుంచి కవితలకు బదులుగా కథా పఠనం చేయాలని నిర్ణయించడం గొప్ప పరిణామమని అభినందించారు. ఈ కార్యక్రమంలో తెరవే జిల్లా అధ్యక్షుడు సి వి కుమార్, ప్రధాన కార్యదర్శి డి. శంకరయ్య, సీనియర్ కథా రచయితలు బీవియన్ స్వామి, బుర్ర తిరుపతి, గాజోజు నాగభూషణం ఉన్నారు.

పత్తి కొనుగోళ్లకు సీసీఐ సిద్ధం

ఏడు మిల్లులను నోటిఫై చేసిన అధికారులు


జమ్మికుంట జిన్నింగ్ మిల్లులో ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్న అధికారులు.

జమ్మికుంట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ పరిధిలో కాటన్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) పత్తి కొనుగోళ్లు చేపట్టేందుకు రంగం సిద్ధం చేస్తోంది. సీసీఐ కొనుగోలు చేసిన పత్తిని జిన్నింగ్ చేసేందుకు ఏడు మిల్లులను అధికారులు నోటిఫై చేశారు. వైభవ్, వజ్రకల్ప, లక్ష్మి, నరసింహా, సరిత, రాజశ్రీ, సీతరామ కాటన్ మిల్లులను ఎంపిక చేశారు. మిల్లర్లతో ఇంకా అగ్రిమెంట్‌చేసుకోలేదు. గురువారం వీటిలో సాఫ్ట్‌వేర్ ఇన్‌స్టాలేషన్ చేశారు. నోటిఫై చేసిన మిల్లుల్లో రైతులకు సీసీఐ నిబంధనలపై అవగాహన కల్పిస్తూ బ్యానర్లు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మార్కెట్ కార్యదర్శి మల్లేశం మాట్లాడుతూ సీసీఐకి పత్తి విక్రయించే రైతులు ఆధార్‌కార్డు, పట్టదారు పుస్తకం, ఆధార్‌తో అనుసంధానం ఉన్న బ్యాంక్ పాస్‌బుక్ జిరాక్స్‌ల వెంట తీసుకురావాలని సూచించారు. ఎనిమిది నుంచి 12 శాతం లోపు తేమ ఉన్న పత్తిని మాత్రమే ప్రభుత్వ మద్దతు ధర క్వింటాల్‌కు 7,521 నుంచి 7,220 రూపాయలు చెల్లించి కొనుగోలు చేస్తుందన్నారు. రైతులు ఇంటి వద్దనే పత్తిని ఆరబెట్టుకుని, నీళ్లు చల్లకుండా తీసుకువచ్చి మద్దతు ధర పొందాలన్నారు. కొద్ది రోజుల్లో సీసీఐ కొనుగోలు కేంద్రాలు ప్రారంభం అవుతాయని, అప్పటి వరకు రైతులు అన్ని సిద్ధం చేసుకోవాలని సూచించారు.

తలనీలాల టెండర్ రూ.1.80 కోట్లు


టెండర్లు నిర్వహిస్తున్న అధికారులు

మల్యాల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం పరిధిలో తలానీలాల పోగు చేసుకునేందుకు అధికారులు నిర్వహించిన వేలంలో రూ.1.80కోట్లు హెచ్చు పాటగా నిలిచింది. తరచూ వాయిదా పడుతూ వస్తున్న టెండర్లలో కాస్త పెంచారు. ఇప్పటికే తొమ్మిది సార్లు టెండర్లు నిర్వహించగా తగిన వేలం రాకపోవడంతో వేలం వాయిదా వేసిన అధికారులు పదో సారి గురువారం హైదరాబాద్‌లోని దేవాదాయ కమిషనర్ కార్యాలయంలో ఈ-టెండర్, సీల్డ్ టెండర్‌కం బహిరంగ వేలం నిర్వహించారు. ఇందులో అయిదుగురు టెండర్ దారులు పాల్గొన్నారు. మార్కెట్‌లో ధరలు లేవనే సాకుతో టెండర్ పెంచకుండా వస్తున్న టెండర్ దారులు నేటి వేలంలో ఏడాది కాలపరిమితికి గాను కేవీఎస్ ఎంటర్‌ప్రైజెస్ రూ.కోటి 80లక్షల వెయ్యి హెచ్చు పాట పలికింది. దీంతో ఖరారు చేయడానికి గాను అనుమతి కోసం కమిషనర్‌కు నివేదించినట్లు ఈవో రామకృష్ణరావు తెలిపారు. ఏడాది కాలపరిమితికి గాను గతంలో రూ.3కోట్లకు పైగా పలుకగా ఇరవై రోజుల క్రితం నిర్వహించిన వేలంలో రూ.1.76 హెచ్చు పాట వచ్చింది. అయి తే దాన్ని రద్దు చేశారు. సుమారు రూ.2లక్షలకు పైగా ఖర్చుతో రూ.4లక్షలు పెరిగినట్లు అయింది. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ కృష్ణవేణి, డిప్యుటి కమిషనర్ టి.వెంకటేష్, ఏఈవో అంజయ్య, పర్యవేక్షకులు చంద్రశేఖర్, సునీల్ ఆలయ సిబ్బంది ఉమామహేశ్వర్ పాల్గొన్నారు.

● నిల్వ తలనీలాలకు కిలోకి రూ.10,300

గత ఏడాది ఆగస్టు నుంచి జూలై వరకు దేవస్థానం ఆధ్వర్యంలో సేకరించి నిల్వ చేసిన తలనీలాల విక్రయానికి గాను ఈ టెండర్‌లో కిలోకి రూ.10,300పలికింది. ఇందులో 11 మంది పాల్గొనగా హైదరాబాద్‌కు చెందిన మదర్ హ్యూమన్ హేర్ ఎంటర్ ప్రైజెస్ కిలోకి రూ.10,300తో హెచ్చు పాటగ నిలిచింది. రెండు నెలల క్రితం నిర్వహించినప్పుడు కిలోకి రూ.8500 రాగ ఇప్పుడు రూ.1800 అదనంగా ఆదాయం సమకూరనుంది.

20న సహకార భారతి రాష్ట్ర సమ్మేళనం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

సుభాష్‌నగర్, అక్టోబరు17: (ఆంధ్రజ్యోతి): సహకార భారతి 4వ రాష్ట్ర సమ్మేళనం ఈ నెల 20న నిర్వహించనున్నట్లు సహకార భారతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు న్యామడుగు శంకరయ్య, జిల్లా అధ్యక్షుడు తుమ్మల రమేశ్‌రెడ్డి తెలిపారు. గురవారం కరీంనగర్‌లోని ప్రెస్ భవన్‌లో రాష్ట్ర సమ్మేళనం కరపత్రం ఆవిష్కరించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ చింతకుంటలో నిర్వహించే రాష్ట్ర సమ్మేళనానికి సహకార భారతి జాతీయ సంఘటన మంత్రి సంజయ్ పాచ్పోర్, జాతీయ మంత్రి చాందినీరాయ్ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు తెలిపారు. తెలంగాణలోని 33 జిల్లాల నుంచి సుమారు వేయి మంది కార్యకర్తలు హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి సర్వాజి తిరుపతి, ఉపాధ్యక్షుడు దొనపాటి సురేందర్‌రెడ్డి, కొత్తపల్లి కన్వీనర్ బండ కిషన్‌రెడ్డి, కో కన్వీనర్ చిటుకూరి శ్రీనివాస్, మన ఆదర్శ డైరెక్టర్ ఉమ్మెంతుల లక్ష్మారెడ్డి, చింతకుంట కన్వీనర్ దొనపాటి రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రేమ పేరుతో వేధింపులు

ఉరేసుకుని విద్యార్థిని ఆత్మహత్య

జగిత్యాల క్రైం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కేంద్రంలో ప్రేమ పేరుతో వేధింపులు భరించలేక తీవ్ర మనస్తాపానికి గురైన ఓ విద్యార్థిని గురువారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఓ బాలిక (13) ప్రభుత్వ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. అదే పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న బాలుడు (13) కొద్ది రోజులుగా ప్రేమ పేరుతో బాలికను వేధిస్తున్నాడు. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపానికి గురైన బాలిక గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు జగిత్యాల టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళలకు అన్ని రంగాల్లో అవకాశాలు కల్పించాలి

భగత్‌నగర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు మహిళలకు అన్ని రంగాల్లో అవకాశాలు కల్పించాలని భారత జాతీయ మహిళా సమాఖ్య ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.సదాలక్ష్మి డిమాండ్ చేశారు. గురువారం కరీంనగర్‌లోని బద్దంఎల్లారెడ్డి భవన్‌లో ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యు ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా మహిళలపై అఘాయిత్యాలు, అత్యాచారాలు పెరిగిపోతున్నాయన్నారు. బాధిత మహిళల రక్షణ కోసం ఉన్న చట్టాలను అమలు చేస్తూ ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా అధ్యక్షురాలు కిన్నెర మల్లవ్వ పాల్గొన్నారు.

కొండగట్టు అంజన్నకు 'డిప్యూటేషన్ల' భారం

- సాధారణ బదిలీలకు ఉద్యోగుల దూరం
- సిబ్బంది కొరత నెపంతో కొనసాగింపు
- ఏళ్ల తరబడి విధులు.. పట్టించుకోని దేవాదాయ శాఖ

మల్యాల,అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయ స్వామి దేవస్థానం పరిధిలో డిప్యూటేషన్‌పై వచ్చిన ఉద్యోగ సిబ్బంది ఏళ్ల తరబడి విధులు నిర్వహిస్తున్నారు. దేవస్థానానికి భారం అయినప్పటికీ సిబ్బంది కొరత నెపంతో దేవాదాయ శాఖ మిన్నకుండిపోతోంది. ఇటీవల సాధారణ బదిలీలు జరుగగా అందులో అవకాశం లేకపోవడంతో డిప్యూటేషన్ ఉద్యోగులు తాము కోరుకున్న చోటకు వచ్చిన చోటే కదలకుండా ఉండాల్సి వచ్చింది. చిన్న ఆలయాల నుంచి డిప్యూటేషన్‌పై రావడం కాలపరిమితి ముగిసే సమయానికి అధికార పార్టీ నేతలు, ప్రజాప్రతి నిధులతో పైరవీలు చేయించుకుంటూ ఏళ్ల తరబ డి కొండగట్టు అంజన్నను వీడడం లేదు. ఇలా 12 ఏళ్లుగా కొందరు ఇక్కడే కొనసాగుతున్నారంటే డిప్యుటేషన్ ఉద్యోగాలకు ఎంత ప్రాధాన్యత ఉందో తెలుస్తోంది.

● నిబంధనలు ఇవీ..

రాష్ట్ర వ్యాప్తంగా గల డిప్యూటీ కమిషనర్, రీజినల్ జోనల్ కమిషనర్ స్థాయి దేవస్థానాలలో పని చేసే ఉద్యోగుల విధివిధానాలను గత 2000 సంవత్సరంలో జీవో 888 ద్వారా ఖరారు చేశారు. దానికి 2019లో అన్ని రకాల బదిలీలు సమాన స్థాయి ఆలయాల్లోకి మాత్రమే చేపట్టాలని జీవో ఎంఎస్ 64 ద్వారా సవరణ చేశారు. నెల రోజుల క్రితం జరిగిన బదిలీలు అన్నింటిని దేవాదాయ శాఖ ఇలాగే చేపట్టింది. ఆర్‌జేసీ, డీసీ ఆలయాలను యూనిట్‌గా తీసుకొని బదిలీల ప్రక్రియ పూర్తి చేశారు. అయితే ఇందులో డిప్యూటేషన్‌పై వచ్చిన వారికి అవకాశం లేకపోగా పెద్ద ఆలయాల్లో చిన్న దేవస్థానాల నుంచి వచ్చిన ఉద్యోగులకు మాత్రం స్థాన చలనం కాకపోగా వారి స్థానాలు పదిలంగా ఉన్నాయి. దేవాదాయ శాఖ నిబంధనల మేరకు సమానస్థాయి ఆలయాలకు సంబంధించిన ఉద్యోగులు విధులు నిర్వహించాల్సి ఉండగా చిన్న ఆలయాల ఉద్యోగులు ఏళ్ల తరబడి తమ కాలపరిమితి పెంచుకునే ఆదేశాలు తీసుకువస్తూ విధులు నిర్వహించడం పట్ల విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానంలో ఆరుగురు ఉద్యోగులు ప్రస్తుతం డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్నారు. వీళ్లలో కొందరు తరచూ పొడగింపు ఆదేశాలతో ఏళ్లుగా కొనసా గుతున్నారు. ఇందులో కొందరి డిప్యూటేషన్ ఇటీవల ముగుస్తుండడంతో మళ్లీ పొందగింపు నకు దేవస్థానం అధికారులు కమిషనర్‌కు నివే దించినట్లు తెలిసింది. దేవస్థానానికి సమకూరే ఆదాయంలో 30శాతం దాటకుండా ఉద్యోగ జీతభత్యాలు చెల్లించాలనే నిబంధనలు, దేవస్థానం అదాయానికి నష్టం వాటిల్లుతున్నప్పటికీ పట్టించుకునే వారే లేరని పలువురు బహిరం గగానే ఆరోపిస్తున్నారు



కొరతతోనే కొనసాగింపు

ఎం. రామకృష్ణరావు, ఈవో

దేవస్థానం ఆదాయంలో 30శాతం కాస్త దాటినప్పటికీ ఉద్యోగుల కొరత దృష్ట్యా డిప్యుటేషన్ ఉద్యోగుల విధులు తప్పనిసరిగా వినియోగించుకోవాల్సి వస్తోంది. ఇక్కడ డిప్యుటేషన్లు గతంలో నుంచే కొనసాగుతున్నాయి. కాలపరిమితి ముగిసిన ఉద్యోగుల డిప్యూటేషన్ పొడగింపునకు కమిషనర్‌కు నివేదించాము.

ఆర్టీసీకి దసరా పండుగ

● కరీంనగర్ రీజియన్‌కు రూ. 31.50 కోట్ల ఆదాయం

భగత్‌నగర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీకి కరీంనగర్ రీజియన్‌లో దసరా పండుగకు రికార్డు స్థాయిలో ఆదాయం సమకూరింది. బతుకమ్మ, దసరా పండుగలను పురస్కరించుకుని ఆర్టీసీ వివిధ రూట్లలో ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులను నడిపించి రీజియన్ వ్యాప్తంగా 31.50 కోట్ల ఆదాయం రాబట్టింది. బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా ఈనెల మొదటి తేదీ నుంచే కరీంనగర్ రీజియన్ వ్యాప్తంగా ఉన్న 11 డిపోల నుంచి వివిధ ప్రాంతాలకు బస్సులను ప్రణాళికాబద్ధంగా నడిపిం చడంలో ఆర్టీసీ అధికారులు సఫలమయ్యారు. ఈ నెల 1వ తేదీ నుంచి 16 తేదీ వరకు ఆర్టీసీ బస్సులను విజయవంతంగా నడిపిం చింది. దసరా ముందు రోజుల్లో జూబ్లీ నుంచి కరీంనగర్, దసరా తర్వాత తిరుగు ప్రయాణంలో కరీంనగర్ నుంచి జూబ్లీ బస్‌స్టేషన్ల మధ్య అదనంగా బస్సులను నడిపించి రికార్డు స్థాయిలో ప్రయాణికులను చేరవేసింది. కరీంనగర్ రీజియన్ వ్యాప్తంగా 53.32 లక్షల కిలోమీటర్ల మేర బస్సులను నడిపించి, 95 శాతం ఆక్యుపెన్సీ రేషియో(ఓఆర్)తో మొత్తం 61,11,849 మంది ప్రయాణికులను గమ్య స్థానాలకు చేరవేసింది.

ఆదాయ సముపార్జనలో సిబ్బంది కృషి

- కరీంనగర్ ఆర్ఎం సుచరిత



ఆర్టీసీ కరీంనగర్ రీజియన్‌కు ఆదాయ సముపార్జనలో సిబ్బంది కృషి ఎంతో ఉంది. రీజియన్ వ్యాప్తంగా అన్ని డిపోల్లో ఆదాయ సముపార్జనలో శక్తివంచన లేకుండా సంస్థ సిబ్బంది, డ్రైవర్లు, కండక్టర్లు ఎంతో కృషి చేశారు. ఆర్టీసీ సేవలు మరింత ముందుకు తీసుకువెళ్తాం.

● కరీంనగర్ రీజియన్ వ్యాప్తంగా డిపోల వారీగా వచ్చిన ఆదాయ వివరాలు..

డిపో	కి.మీ (లక్షల్లో)	ఆదాయం (లక్షల్లో)	ఓఆర్	మొత్తం ప్రయాణికులు	మహాలక్ష్మి ప్రయాణికులు
గోదావరిఖని	8.06	527.45	104	9,79,400	6,87,807
హుస్నాబాద్	2.63	143.42	96	4,00,808	2,77,121
హుజూరాబాద్	3.46	211.49	107	4,89,314	3,25,629
జగిత్యాల	7.18	421.74	92	8,08,209	5,70,138
కరీంనగర్-1	6.31	338.36	81	5,51,087	3,53,221
కరీంనగర్-2	7.91	423.19	86	6,65,215	4,22,017
కోరుట్ల	3.59	225.73	99	4,56,980	3,46,469
మంథని	3.19	183.91	92	3,04,307	1,98,840
మెట్‌పలి	3.24	214.21	102	4,72,399	3,60,976
సిరిసిల్ల	3.78	227.44	99	4,68,034	2,96,512
వేములవాడ	3.98	232.86	97	5,16,096	3,95,814
రీజియన్	53.32	3149.80	95	6111849	4234544

సరస్వతీమాత హోమం

కరీంనగర్ కల్చరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సరస్వతీ శిశుమందిర్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో గురువారం సరస్వతీమాత హోమం నిర్వహించారు. డాక్టర్ నాళ్ళ సత్యవిద్యాసాగర్-స్వప్న దంపతులు హవనంలో పాల్గొనగా హవనాన్ని శంకర్ ఆర్యాన్ జరిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సముద్రాల రాజమౌళి, కార్యదర్శి కోల అన్నారెడ్డి, పాల్గొన్నారు.

మాజీ కార్పొరేటర్‌కు పరామర్శ

కరీంనగర్ టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మాజీ కార్పొరేటర్ ఎడ్ల అశోక్ తండ్రి రంగస్వామి ఇటీవల మరణించడంతో గురువారం ఆయన నివాసానికి వెళ్ళి బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ సుడా చైర్మన్ జీవీ రామకృష్ణారావు అశోక్‌ను పరామర్శించారు.కార్యక్రమంలో మానకొండూర్ మాజీ జడ్పీటీసీ తాళ్ళపల్లి శేఖర్‌గౌడ్, మాజీ సర్పంచ్ రామంచ గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

కరీంనగర్ రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం చేగుర్తి గ్రామం నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తుండగా పోలీసులు గురువారం మూడు ట్రాక్టర్లను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కొద్ది రోజులుగా ఆన్‌లైన్‌లో స్లాట్ బుకింగ్ లేక పోవడంతో క్వారీలు కూడా సరిగా నడవడం లేదు. దీన్ని ఆసరాగా తీసుకుని చేగుర్తి గ్రామంలో ఓ మాజీ ప్రజా ప్రతినిధి సిండికేట్‌గా ఏర్పడి ట్రాక్టర్ యజమానుల నుంచి ట్రాక్టర్‌కు 5వేల రూపాయల చొప్పున వసూలు చేసినట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. గురువారం రాజీవ్ రహదారి బొమ్మకల్ వద్ద మూడు ట్రాక్టర్‌లను రూరల్ పోలీసులు పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఇందులో గొల్లపెల్లికి చెందినవి ఉండగా మరో ట్రాక్టర్ చేగుర్తి గ్రామానికి చెందిన స్థానిక నాయకుడిదే ఆరోపణలు ఉన్నాయి. ఇసుక అక్రమ రవాణాపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

నియామకం

కరీంనగర్ టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారుల ఫోరం కరీంనగర్ నియోజకవర్గ అధ్యక్షుడిగా కరీంనగర్‌కు చెందిన జంగాలపల్లి కుమార్ నియమితులయ్యారు. గురువారం ఫోరం రాష్ట్ర చైర్మన్ చీమ శ్రీనివాస్ నియామక ఉత్తర్వులను జారీ చేశారు.

ఆయిల్ పామ్ సాగు పెంచేందుకు చర్యలు

కరీంనగర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో ఆయిల్‌పామ్ సాగును పెంచేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి వ్యవసాయ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ఏవోలు, ఏఈవోలు, హార్టికల్చర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో 2,300 ఎకరాల ఆయిల్ పామ్ సాగు లక్ష్యం కాగా, ఇప్పటి వరకు 251 ఎకరాల్లో మాత్రమే సాగు చేశారన్నారు. నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకునేందుకు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రామాలకు వెళ్లి రైతులకు ఆయిల్ పామ్ సాగుపై అవగాహన కల్పించాలన్నారు.

పంట సాగు చేసిన రైతులకు నిర్వహణ ఖర్చులు వారి ఖాతాల్లో జమవుతున్నాయో లేదో తెలుసుకోవాలని కలెక్టర్ అన్నారు. రైతులకు అంతర్‌పంటలతో వచ్చే లాభాలను వివరించాలని చెప్పారు. ప్రతి ఏఈవో తప్పనిసరిగా 25 ఎకరాలకు తగ్గకుండా ఆయిల్ పామ్ సాగయ్యేలా చూడాలని, రైతు వేదికల్లో రైతు నేస్తం కార్యక్రమాన్ని నిర్వహించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో హార్టికల్చర్ జిల్లా అధికారి కమలాకర్‌రెడ్డి, ఇన్‌చార్జి వ్యవసాయాధికారి మహేశ్ పాల్గొన్నారు.


మందులను పరిశీలిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

వైద్య సేవలపై అవగాహన కల్పించాలి

భగత్‌నగర్: బస్తీదవాఖానాలో ఉచితంగా అందిస్తున్న వైద్య సేవలు, రోగ నిర్ధారణ పరీక్షలపై మహిళలకు అవగాహన కల్పించాలని జిల్లాకలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. గురువారం నగరంలోని రేకుర్తి బస్తీ దవాఖానాను సందర్శించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కుక్క, పాము కాటు బాధితులకు సంబంధించిన మందులు అందుబాటులో ఉంచకో వాలన్నారు.

ప్రజలకు వైద్యంపై అవగాహన కల్పించేలా బస్తీ దవాఖానాలో టీవీ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. బస్తీ దవాఖానాలో ల్యాబ్, మందుల గది, రికార్డులు పరిశీలించారు. బస్తీ దవాఖానాను పరిశీలించి డీఎంహెచ్ఓ సుజాతను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బస్తీ దవాఖానా వైద్యాధికారి మౌల్య, ప్రోగ్రాం ఆఫీసర్ సనా, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్ నుంచి శబరిమలకు పాదయాత్ర ప్రారంభం


పాదయాత్రను ప్రారంభిస్తున్న అయ్యప్ప భక్తులు

కరీంనగర్ కల్చరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రానికి చెందిన గడప నాగరాజు గురుస్వామి ఆధ్వర్యంలో కరీంనగర్ టూ శబరిమల 24వ మహాపాదయాత్ర గురువారం జడ్పీ క్వార్టర్స్‌లోని అయ్యప్ప ఆలయం నుంచి ప్రారంభమైంది. యాత్రను కావేటి పరమేశ్వర్ గురుస్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా నాగరాజు గురుస్వామి మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాకు చెందిన సుమారు 100 మంది దీక్షాపరులు యాత్రలో పాల్గొంటున్నారని, ఆయా ప్రాంతాల్లో మరి కొంత మంది తమతో జత కలుస్తారని అన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాలలోని (కర్నూల్, అనంతపూర్, చిక్బల్లాపూర్, దేవనల్లి, ఉర్సూర్, సేలం, కుమిలి, వెండి పెరియార్, పులిమేడ) వివిధ ప్రాంతాలు, పుణ్య క్షేత్రాల మీదుగా నవంబర్ 29వ తేదీకి శబరిమలలో సన్నిధానంలో అయ్యప్ప స్వామిని దర్శించు కుంటామని అన్నారు.

ఈకార్యక్రమంలో గురు స్వాములు యాగండ్ల అనిల్‌కుమార్, డి సంపత్, బండారి శ్రావణ్, శ్రీహరియాదవ్, కర్లాల రాము, గంగుల సురేశ్, గురువయ్య, రుద్రాక్ష కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలి

భగత్‌నగర్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను ప్రభుత్వం విడుదల చేయాలని పీడీఎస్‌యూ ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అంగిడి కుమార్, ముల్కల మారుతి డిమాండ్ చేశారు. మూడు సంవత్సరాలుగా రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల కాక ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు బంద్‌కు పిలుపు ఇచ్చాయన్నారు. వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని లేకపోతే ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

●సుభాష్‌నగర్, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని బీసీ విద్యార్థి సంగం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నారోజు రాకేష్‌చారి డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం డీఆర్‌వోకు వినతిపత్రం అందజేశారు.

వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

సుభాష్‌నగర్, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కరీంనగర్ ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ పర్ష రమేశ్ అన్నారు. గురువారం నగరంలోని మెడికవర్ ఆసుపత్రిలో వరల్డ్ ట్రామా డేను నిర్వహించారు. ఈ సందర్భంగా అంబులెన్స్ డ్రైవర్లతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వాహనాలు నడిపేవారు హెల్మెట్, సీటు బెల్టు పెట్టుకోవడం మరచిపోవద్దన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్, న్యూరో సర్జన్లు బోగ వెంకటేష్, క్రిటికల్ కేర్ నిపుణుడు డాక్టర్ ఉపేందర్‌రెడ్డి, యూరాలజిస్టు డాక్టర్ రవి శంకర్, గ్యాస్ట్రో సర్జన్ డాక్టర్ దిలీప్‌రెడ్డి, ఎమర్జెన్సీ ఫిజీషియన్ డాక్టర్ సత్యనారాయణ, సూపరింటెండెంట్ డాక్టర రవి మల్లారెడ్డి, మార్కెటింగ్ మేనేజర్ కోట కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి మహర్షి గొప్ప కవి

కరీంనగర్ టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మహర్షి వాల్మీకి గొప్పకవిగా, తత్వవేత్తగా పేరుగడించారని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. గురువారం వాల్మీకి జయంతిని పురస్కరించుకొని కలెక్టరేట్ కాన్ఫరెన్సు హాల్‌లో వాల్మీకి చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ట్రైనీ కలెక్టర్ అజయ్‌కుమార్, డీఆర్‌డీవో శ్రీధర్ పాల్గొన్నారు.

●కరీంనగర్ క్రైం: వాల్మీకి మహర్షి చిత్రపటానికి అడిషనల్ డీసీపీ ఎ లక్ష్మీనారాయణ నివాళులర్పించారు.

వైరాగ్యం ప్రభాకర్‌కు సాహిత్య శ్రీ అవార్డు

కరీంనగర్ కల్చరల్, అక్టోబరు 17: అఖిల భారతీయ భాషా సాహిత్య సమ్మేళన్ ఆధ్వర్యంలో జరిగే ఆంధ్రప్రదేశ్ స్టేట్ చాప్టర్ 33వ నేషనల్ కాన్ఫరెన్స్‌లో జిల్లా కేంద్రానికి చెందిన రచయిత, విశ్రాంత ఉపాధ్యాయుడు వైరాగ్యం ప్రభాకర్ సాహిత్య శ్రీ అవార్డు అందుకోనున్నారు. జాతీయ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వీరేంద్రసింగ్, శృతి చతుర్వేది ఒక ప్రకటనలో తెలిపారు.

'ప్రభుత్వ భూమిని కాపాడాలి'

భగత్‌నగర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సాయినగర్‌లో ప్రభుత్వ భూమిని కబ్జా నుంచి కాపాడాలని సాయినగర్‌కాలనీ వాసులు మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందించారు. సాయినగర్‌లోని సర్వే నెంబర్ 1479లో గల ప్రభుత్వ భూమిని తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి కబ్జా చేసిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సాయినగర్ కాలనీ వాసులు బొడ్డు అశోక్‌కుమార్, మాట్లబెనర్జీ, కట్ల అభిషేక్, బొడ్డురవీందర్, కుమ్మరి నవసచిన్, నేరెళ్లరాజశేఖర్, కుమ్మరి దినేష్, అరవింద్, దినేష్, జగదీశ్వర్, తదితరులుపాల్గొన్నారు.

రామ్ మొగిలోజుకు ఫిల్మ్ ఫెస్టివల్ అవార్డు

కరీంనగర్ కల్చరల్, అక్టోబరు 17: విరాట్ క్రియేషన్స్ సంస్థ ద్వారా ఎన్నో షార్ట్ ఫిల్మ్‌లు చేస్తున్న రామ్ మొగిలోజు ఇటీవల తన దర్శకత్వంలో వచ్చిన గంజాయ్ డౌన్ డౌన్ అనే సందేశాత్మక చిత్రానికి అంతర్జాతీయ పురస్కారం అందుకున్నారు. గురువారం ఒడిస్సా రాష్ట్రంలోని భువనేశ్వర్‌లో జయదేవ్ భవన్‌లో ఇండియన్ ఫిల్మ్ మేకర్స్ అసోసియేషన్ సంస్థ ఆధ్వర్యంలో ఇంటర్‌నేషనల్ ఫిలిం ఫెస్టివల్ ఆఫ్ ఒడిస్సా పేరుతో నిర్వహించిన అవార్డుల ప్రదానంలో సంస్థ ప్రతినిధుల చేతుల మీదుగా అవార్డును రామ్ స్వీకరించారు.

వేధింపులపై షీటీంకు ఫిర్యాదు చేయండి

కరీంనగర్ క్రైం, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): విద్యార్థినిలు, మహిళలు పోకిరీల వేదింపులపై షీటీంకు నిర్భయంగా ఫిర్యాదు చేయాలని కరీంనగర్ మహిళా రాణా, షీటీం ఇన్‌చార్జి సీఐ పి శ్రీలత అన్నారు. గురువారం కరీంనగర్ హౌసింగ్ బోర్డు కాలనీలోని సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో షీటీం సిబ్బంది పాల్గొన్నారు.

పేద విద్యార్థినికి ఆర్థిక సహాయం

సుభాష్‌నగర్, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని రిషి కాన్వెంట్‌లో 10వ తరగతి చదువుతున్న సాత్విక అనే విద్యార్థినికి కరీంనగర్ లయన్స్‌క్లబ్ ప్రతినిధులు రూ.10వేల ఆర్థిక సహాయాన్ని అందచేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు ముక్క శతర్‌కృష్ణ, ప్రధానకార్యదర్శి మ్యాడం శివకాంత్ పాల్గొన్నారు.

విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

కరీంనగర్ రూరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసై తమ జీవితాన్ని నాశనం చేసుకోవద్దని ఎక్సైజ్ సీఐ అశోక్ విద్యార్థులకు సూచించారు. గురువారం కరీంనగర్ మండలం మొగ్దుంపూర్ గ్రామంలో మాదక ద్రవ్యాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ చైల్డ్ హెల్ప్ లైన్ 1098 జిల్లా కోఆర్డినేటర్ ఆవుల సంపత్, ఎక్సైజ్ శాఖ సిఐ అశోక్ పాల్గొన్నారు.

'సమస్యల పరిష్కారానికి కృషి'

కరీంనగర్ టౌన్, అక్టోబర్ 17: ఉద్యోగ, ఉపాధ్యాయ, నిరుద్యోగ యువత, పట్టభద్రుల సమస్యలపై చట్టసభల్లో ప్రస్తావించి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని, తనను ఆశీర్వదించి టీచర్ ఎమ్మెల్సీగా గెలిపించాలని ఎమ్మెల్సీ అభ్యర్థి పోలు సత్యనారాయణ కోరారు. గురువారం ఆయన జిల్లా కేంద్రంలోని ఎస్సారార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, చింతకుంట మోడల్ స్కూల్‌కు వెళ్ళి ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కృష్ణచైతన్య

సుభాష్‌నగర్, అక్టబరు17(ఆంధ్రజ్యోతి): తెలంగాణ పద్మశాలి యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మెతుకు కృష్ణచైతన్యను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి వరుల గౌతంకుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

హిందూ సాంప్రదాయాల పరిరక్షణకు గణపతి సచ్చిదానంద కృషి

కరీంనగర్ అర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : హిందూ సాంప్రదాయాల పరిరక్షణకు గణపతి సచ్చిదానందస్వామి కృషి చేస్తున్నారని కాంగ్రెస్‌పార్టీ కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన గురువారం హైదరాబాద్‌లో ఆధ్యాత్మిక గురువు డాక్టర్ శ్రీ గణపతి సచ్చిదానంద స్వామిని ప్రత్యేకంగా కలిశారు.

రైల్వేస్టేషన్‌లో ముమ్మరంగా అభివృద్ధి పనులు

కరీంనగర్ రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రైల్వేస్టేషన్‌లో ఆధునీకరణ పనులు ముమ్మరంగా కొనసాగు తున్నాయి. త్వరలో కరీంనగర్ రైల్వే స్టేషన్‌కు కొత్త శోభ సంతరించుకుంది. రైల్వే స్టేషన్ల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం భారత్ అమృత్ మాల పథకాన్ని ప్రవేశ పెట్టింది. తెలంగాణలో మొదటి దశలో 21 రైల్వే స్టేషన్ల ఆధునీకరణ పనులు చేపడు తుండగా అందులో కరీంనగర్ రైల్వే స్టేషన్ ఉంది. కరీంనగర్ రైల్వే స్టేషన్ అభివృద్ధికి గతేడాది 26కోట్ల నిధులు మంజూరు చేయగా గతేడాది ఆగస్టు 6న ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. కరీంనగర్ రైల్వే స్టేషన్‌లో ప్రస్తుతం ఉన్న స్టేషన్ భవనం పక్కనే నూతనంగా మరో భవనం నిర్మిస్తున్నారు. ప్రయాణికులు విశ్రాంతి తీసుకునేందుకు వీలుగా ప్రత్యేక గదులు, విశ్రాంతి రూములు, టికెట్ కౌంటర్ భవన నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయి.


కరీంనగర్ రైల్వే స్టేషన్‌లో నిర్మిస్తున్న నూతన భవనం

కొత్తగా 2,3 ప్లాట్ ఫారంలు నిర్మించే పనులు నడుస్తు న్నాయి. స్టేషన్ లోపల బయట సీసీ కెమెరాలు, విద్యుత్ లైట్లు, షాపింగ్ కాంప్లెక్స్, టికెట్ కౌంటర్ల ముందు కుర్చీలు ఏర్పాటు చేయనున్నారు.

త్వరలో ఎస్కలేటర్ సదుపాయం కూడా కలగనుంది. అందుకు సంబం ధించిన పనులు తుది దశకు చేరుకు న్నాయి. ముందు భాగంలో బీటి రోడ్డు అతిపెద్ద జాతీయ జెండాను ఏర్పాటు చేశారు. కరీంనగర్ రైల్వే స్టేషన్‌కు బస్సు సౌకర్యం లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు బస్సు సౌకర్యం కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

కరీంనగర్‌లో పలు ప్రాంతాల్లో పిడుగులు

కరీంనగర్ క్రైం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో తెల్లవారుజామున 4:30 గంటలకు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఈ సమయంలో పలుచోట్ల పిడుగులు పడ్డాయి. చైతన్యపురికాలనీలో జువ్వాడి వేణుగోపాల్‌రావు ఇంటిపై పిడుగుపడింది. పై అంతస్థు పిట్టగోడ దెబ్బతిన్నది. ఆయన ఇంటిలోని రిఫ్రిజిరేటర్, ఫ్యాన్, టీవీ, లిఫ్ట్ మోటార్లు కాలిపోయాయి. చుట్టుపక్కల పదిళ్లలో ఫ్యాన్లు, బోర్ మోటార్, ఇతర గృహోపకరణ వస్తువులు కాలిపోయాయయని స్థానికులు తెలిపారు.

చింతకుంట శాంతినగర్‌లో మూడు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయినట్లు స్థానికులు తెలిపారు. ఇదే సమయంలో పద్మనగర్ 11/33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మంటలు చెలరేగాయి. ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. పిడుగుపడడంతోనే ఈ ప్రమాదం జరిగిందని అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపారు. సబ్‌స్టేషన్‌లోని రెండు ట్రాన్స్‌ఫార్మర్లు పేలడంతోనే ఈ ప్రమాదం జరిగిందని ఏడీఈ రజిత తెలిపారు. ట్రాన్స్‌కోకు లక్ష రూపాలయ వరకు నష్టం జరిగిందని పేర్కొన్నారు. సిబ్బంది వెంటనే విద్యుత్ సరఫరా పునరుద్ధరించారని ఆమె తెలిపారు.

సమాచార హక్కు చట్టం ప్రజలకు ఆయుధం

హుజూరాబాద్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టం ప్రజలకు ఒక ఆయుధం లాంటిదని యూనిటెడ్ ఫోరం ఫర్ ఆర్టీఐ తెలంగాణ ఉమ్మడి జిల్లా కన్వీనర్ జి స్వామిరెడ్డి అన్నారు. హుజూరాబాద్ ప్రెస్ క్లబ్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభు త్వం సమాచార కమిషన్ వెంటనే నియమించాలని డిమాండ్ చేశారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

గంగాధర, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రోడ్డు పనులకు నిధులు మంజూరు చేయడంతో కోట్ల నర్సింహులపల్లి, ముప్పిడినర్సయ్యపల్లి గ్రామస్థులు గురువారం సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తోట కవితామల్లారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

'అలయ్ బలయ్'ని విజయవంతం చేయాలి

మానకొండూర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): తిమ్మాపూర్‌లో ఆదివారం నిర్వహించే అలయ్ బలయ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణారావు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మానకొండూర్‌లో గురువారం మండల కార్యకర్తల సమావేశం నిర్వహించారు.

బీఆర్ఎస్ పాలనలోనే విద్యకు పెద్దపీట

చొప్పదండి, అక్టోబర్17(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పాలనలోనే కేసీఆర్ విద్యకు పెద్దపీట వేశారని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గురుకుల వ్యవస్థను కనీసం నిర్వహించడం కూడా చేతకాని స్థితిలో రేవంత్ సర్కార్ ఉందని పేర్కొన్నారు.

లఘు చిత్రానికి పురస్కారం

చొప్పదండి, అక్టోబర్17 (ఆంధ్రజ్యోతి): చొప్పదండి పట్టణానికి చెందిన సినిమా రచ యిత, తాళ్ళపల్లి చత్రపతి శ్రీనివాస్ నిర్మించిన లఘు చిత్రానికి అంతర్జాతీయ పురస్కారం లభించింది. ఒడిశా రాష్ట్రంలోని భువనేశ్వర్‌లోని ఇంటర్నేషనల్ ఫిలిం మేకర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో చత్రపతికి అవార్డును అందజేశారు.


బాధిత కుటుంబానికి పరామర్శ

శంకరపట్నం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గద్దపాక గ్రామంలో ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ వ్యక్తిగత కార్యదర్శి పల్కల శ్రీనివాస్‌రెడ్డి తండ్రి ప్రభాకర్‌రెడ్డి మృతి చెందగా గురువారం ఆయన పరామర్శించారు. ప్రభాకర్‌రెడ్డి అంత్యక్రియల్లో ఎమ్మెల్యే పాల్గొని పాడె మోశారు. కార్యక్రమంలో పీసీసీ మెంబర్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, జిల్లా వర్కిం గ్ ప్రెసిడెంట్ పద్మాకర్‌రెడ్డి, మండలాధ్యక్షుడు బసవయ్య, పాల్గొన్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

హుజూరాబాద్‌రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతిరెడ్డిపేట గ్రామంలో పోచమ్మ తల్లి నాభి శిల భూలక్ష్మీ-మహాలక్ష్మీ అమ్మవార్ల ప్రతిష్ఠ నాల్గో వార్షికోత్సవం సందర్భంగా గురువారం గ్రామస్థులు ప్రత్యేక పూజలు చేశారు. పోచమ్మ తల్లి శోభాయాత్ర చేపట్టారువ.

మానేరు డ్యాంపై బ్రిడ్జి సాధనకు ఉద్యమిస్తాం


నినాదాలు చేస్తున్న అఖిలపక్ష నాయకులు

గన్నేరువరం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గన్నేరువరం నుంచి కరీంనగర్ కు మానేరు డ్యాంపై బ్రిడ్జి నిర్మాణానికి ఉద్యమిస్తామని బ్రిడ్జి సాధన జేఏసీ చైర్మన్ సంపతి ఉదయ్‌కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో సంపతి ఉదయ్‌కుమార్ ఆధ్వర్యంలో గన్నేరువరం, బెజ్జంకి, ఇల్లంతకుంట మండలాల బ్రిడ్జి జేఏసీ అఖిలపక్ష నాయకులతో సమావేశం నిర్వహించి తీర్మానం చేశారు.

పశువులకు గాలికుంటు వ్యాధి టీకా వేయించాలి

● జిల్లా పశువైద్యాధికారి వేణుగోపాల్‌రావు

సైదాపూర్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): అన్ని రకాల పశువులకు గాలికుంటు వ్యాధి టీకా వేయించాలని జిల్లా పశువైద్యాధికారి వేణుగోపాల్‌రావు రైతులకు సూచించారు. సైదాపూర్ మండలంలోని దుద్దెనపల్లి గ్రామంలో బుధవారం నిర్వహించిన పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకా కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్‌రావు మాట్లాడుతూ పాడి పశువులు ఉన్న ప్రతీ రైతు వ్యాధి నివారణ టీకా వేయించాలని సూచించారు. అనంతరం ఆయన గ్రామంలోని డెయిరీలను సందర్శించి రైతులకు పాడి పశువుల పెంపకంపై అవగాహన కల్పించారు. రైతులకు పలు సూచనలు చేశారు. రైతులు ఆర్థికంగా బలపడేందుకు పశుపోషణ చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ సీహెచ్ విజేంద ర్‌రావు, సిబ్బంది మహేష్, లాలు, సమ్మిరెడ్డి, శైలజ, గోపాల మిత్రలు తాళ్లపెల్లి శ్రీనివాస్, పి శ్రీనివాస్, శరత్ తదితరులు పాల్గొన్నారు.


టీకా కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జిల్లా పశువైద్యాధికారి వేణుగోపాల్‌రావు

ఓటు నమోదు చేసుకోవాలి

సైదాపూర్, అక్టోబర్ 17(ఆంధ్రజ్యోతి): అర్హులు నవంబరు 6వతేదీ లోపు ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత వి నరేందర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు బుధవారం వెళ్లి తనకు మద్దతు తెలుపాలని కోరారు.

ప్రైవేట్ ఉద్యోగులకు సంరక్షణ చట్టం తీసుకురావాలి

హుజూరాబాద్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ సంస్థల్లో పనిచేసే ఉద్యోగులకు సంరక్షణ చట్టం తేవాలని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి యాదగిరి శేఖర్‌రావు అన్నారు. గురువారం హుజూరాబాద్ పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాల్లో ఆయన ప్రచారం నిర్వహించారు.

వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన

శంకరపట్నం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల పాఠశాలలో విద్యార్థునులకు వ్యక్తిగత పరిశుభ్రతపై మండల వైద్యాధికారి డాక్టర్ శ్రావణ్ గురువారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హోమియో వైద్యురాలు సంధ్య, కమ్యూనిటీ హెల్త్ ఆఫీ సర్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రామడుగు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మోడల్ స్కూల్‌లో 9,10వ తరగతి విద్యార్థులకు సాంఘీకశాస్త్రం, ఇంటర్మీయట్ అర్థశాస్త్రం బోధించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఇన్‌చార్జీ ప్రిన్సిపాల్ మనోజ్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఏ ఎకనామిక్స్, బీఈడీ అర్హత ఉన్న వారు శనివారం ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు.

సభ్యత్వ నమోదుపై దృష్టి సారించాలి

- బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి

గంగాధర, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): కార్యకర్తలు సభ్యత్వ నమోదుపై దృష్టి సారించాలని, ఎక్కువగా చేసిన వారికే పార్టీలో సముచిత స్థానం ఉంటుందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి అన్నారు. గంగాధరలో గురువారం నియోజకవర్గ స్థాయి సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ కార్యకర్త ఈనెల 24 లోగా టార్గెట్ పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గంగాడి క్రిష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే బొడిగే శోభ, సభ్యత్వ నమోదు కోఆర్డీనేటర్ మాడ వెంకటరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి పెరుక శ్రవన్‌కుమార్, నియోజకవర్గ, మండల నాయకులు పాల్గొన్నారు.

గురుకులంలో సీటు ఇప్పిస్తానని మోసం

- న్యాయం చేయాలని పోలీసులకు మహిళ ఫిర్యాదు

గన్నేరువరం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): చొప్పదండి బీసీ గురుకుల హాస్టల్‌లో సీటు ఇప్పిస్తానని తన దగ్గర 75 వేల రూపాయలు తీసుకొని మోసగించారని, తనకు న్యాయం చేయాలని కరీంనగర్ జిల్లా కేంద్రానికి చెందిన వడ్లకొండ వాణి అనే మహిళ గురువారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం పోలీస్‌స్టేష న్ ఎదుట విలేకరులతో ఆమె మాట్లాడారు. తన కుమారుడు చరణ్‌కు ఏడో తరగతికి చొప్పదండిలోని బీసీ గురుకుల పాఠశాలలో సీటు ఇప్పిస్తానని మండలంలోని మైలారం గ్రామానికి చెందిన ముత్యాల రజని, మండల కేంద్రానికి చెందిన మీసేవ నిర్వాహకుడు తేల్ల రవిందర్, తేల్ల మహేష్ 75 వేలు తీసుకున్నారని చెప్పారు. హాస్టల్‌కు తన కుమారుడిని తీసుకెళ్లాక వారు తీసుకోలేదన్నారు. తన డబ్బులు తిరిగి ఇవ్వాలని వారికి ఫోన్ చేస్తే నం బరు బ్లాక్ చేశారని తెలిపారు. తన దగ్గర డబ్బులు తీసుకున్నట్లు ఆడియో సంభాషణలు ఉన్నట్లు తెలిపారు. ఈ విషయమై ముత్యాల రజనిని వివరణ కోరగా తాను హాస్టల్ సీటు కోసం ఆమె దగ్గర డబ్బులు తీసుకోలేదని తేల్ల మహేష్‌తో సదరు మహిళ పరిచయమైందని చెప్పారు. వారు చెబితేనే హాస్టల్లో సీటు ఇప్పించడానికి వెళ్లానని అన్నారు. వారు ఆమె వద్ద ఎంత తీసుకున్నారో తెలియదని తనక పది వేలు ఇచ్చినట్లు తెలిపారు.

వాల్మీకి మహర్షికి ఘన నివాళి


హుజూరాబాద్‌లో వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

హుజూరాబాద్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్, జమ్మికుంటలో వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా గుగురువారం నాయకులు ఆయన చిత్రప టానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధికతో పాటు పలువురు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కమిషనర్ సమ్మయ్య, మేనేజర్ భూపాల్‌రెడ్డి, అశ్విని గాంధీ, కిషన్‌రావు, పాల్గొన్నారు.

జమ్మికుంట: జమ్మికుంట మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ఎండీ ఆయాజ్, వైస్‌చైర్‌పర్సన్ దేశిని స్వప్న- కోటి ఆధ్వర్యంలో వాల్మీకి చిత్రపటా నికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మేనేజర్ జి రాజిరెడ్డి, కౌన్సిలర్లు బొంగోని వీరన్న, పొనగంటి మల్లయ్య, దేశిని రాధ-సదానందం, పిట్టల శ్వేత-రమేష్, తదితరులు పాల్గొన్నారు.

నియామకాలు

రెడ్డి సంఘాల ఐక్య వేదిక జిల్లా కో ఆర్డినేటర్‌గా వేణుగోపాల్‌రెడ్డి

రామడుగు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి: శ్రీరాములపల్లి గ్రామానికి చెందిన కోన్న వేణుగోపాల్‌రెడ్డిని తెలంగాణ రెడ్డి సంఘాల ఐక్య వేదిక జిల్లా కో ఆర్డినేటర్‌గా నియమిస్తూ అధ్యక్షుడు వంచ సుదర్శన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి చింతల శ్రీనివాస్‌రెడ్డి గురువారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. వేణుగోపాల్‌రెడ్డి మాట్లా డుతూ పేద రెడ్డిల అభ్యున్నతి కోసం కృషి చేస్తానని తెలిపారు.

● ఇల్లందకుంట: పాతర్లపల్లి గ్రామానికి చెందిన బైరెడ్డి రమణారెడ్డిని తెలంగాణ రాష్ట్ర రెడ్డి సంఘాల ఐక్యవేదిక జిల్లా జాంయింట్ సెక్రటరీగా, లక్మాజిపల్లె గ్రామానికి చెందిన తాళ్ల పాపిరెడ్డిని జిల్లా కార్యవర్గ సభ్యుడిగా నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

● హుజూరాబాద్‌రూరల్: మండలంలోని తుమ్మనపల్లి గ్రామానికి చెందిన నర్రా శ్రీనివాస్‌రెడ్డిరె డ్డిఐక్య వేదిక జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు వంచ సుదర్శన్‌రెడ్డి గురువారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు.

ఉద్యమకారుల ఫోరం నియోజకవర్గ అధ్యక్షుడిగా మల్లాచారి

ఇల్లందకుంట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఇల్లందకుంట మండలం రాచపల్లి గ్రామానికి చెందిన ఊకంటి మల్లాచారిని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం హుజూరాబాద్ నియోజకవర్గ అధ్యక్షుడిగా నియమిస్తూ రాష్ట్ర చైర్మన్ శ్రీనివాస్ ఉత్తర్వులు జారీ చేశారు. మల్లాచారి మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రారంభం కాని ధాన్యం కొనుగోలు కేంద్రాలు

చిగురుమామిడి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కోతలు పూర్తి చేసిన రైతులు గత్యంతరం లేక పచ్చి ధాన్యాన్ని ప్రైవేట్ మిల్లులకు తరలిస్తున్నారు. దీంతో వ్యాపారులు 1800 నుంచి 1930 రూపాయల ధరతో ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. వరి కోతలు ప్రారంభమైనప్పటికీ స్థానిక ఎమ్మెల్యే, మంత్రి పొన్నం ప్రభాకర్, అధికారులు సైతం పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.